- పెన్నా ప్యాకేజీ-1 అక్రమాలపై అధికారుల మౌనం
- ఆధారాలు ఉన్నా స్పందించని ఇరిగేషన్‌శాఖ
- కలెక్టర్ కోరినా వివరణ ఇవ్వని వైనం
- ప్రీక్లోజ్ తర్వాత సీఈ ఎలా రివైజ్ చేశారో..!?

అంతా గప్‌చుప్..!

నెల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అధికారమే అండగా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ ప్రజాప్రతినిధికి భారీ లబ్ధి చేకూరుస్తూ ఇరిగేషన్ అధికారులు అక్రమాలకు తెరలేపారు. పెన్నా డెల్టా ఆధునికీకరణ ప్యాకేజీ-1 పనులకు సంబంధించి ఏకంగా సర్టిఫికెట్లనే కొట్టివేసి రూ.4.12 కోట్లు అదనంగా బిల్లు చేశారు. అంతకుముందు ఇదే 48వ బిల్లు పేరుతో మరో రూ.4.40 కోట్లకు క్యాసీలు మంజూరు చేశారు. ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశాక రివైజ్ పేరుతో భారీగా అంచనాలు పెంచారు. ఈ మొత్తం బాగోతంలో రూ.కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఇందుకు సంబంధించి ఆధారాలతో సహా బయటకు వచ్చినా ఇరిగేషన్‌శాఖ స్పందించడం లేదు. అసలు వాస్తవాలేమిటన్నది నిగ్గు తేలుద్దామన్న ఆలోచన కూడా వారిలో కనిపించడం లేదు. అసలే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటే ఇంత భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వస్తున్నా, కనీసం వీటిని పట్టించుకునే తీరిక కూడా రాష్ట్ర ఉన్నతాధికారులకు లేకుండా పోతోంది. అయితే ఇందులో ఎలాంటి అక్రమాలు జరగలేదని జిల్లాస్థాయి అధికారులు, రాష్ట్ర స్థాయి ఉన్నతా. దికారులను తప్పుదోవ పట్టిస్తు న్నట్లు సమాచారం. అవక తవకలు జరిగినట్లు ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వీటిపై విచారణ జరిపితే వాస్తవాలు తేలుతాయి. అయితే జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఇరిగేషన్ అధికారులెవరూ కూడా ఈ ఆరోపణలపై నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



కలెక్టర్ ఆదేశించినా...

పెన్నా డెల్టా ఆధునికీకరణ ప్యాకేజీ-1 పనుల్లో జరిగిన అవకత వకలపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై స్పందించిన కలెక్టర్ ఆనంద్.. అందుకు వివరణ ఇవ్వాలంటూ ఇరిగేషన్ ఎస్‌ఈ దేశానాయక్‌ను ఆదేశించారు. అయితే వారం గడిచినా ఇంత వరకూ ఇరిగేషన్ శాఖ నుంచి వివరణ అందలేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్యాకేజీ-1 పనుల బిల్లులపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ సెంట్రల్ డివిజన్ ఈఈకి ఇరిగేషన్ ఎస్‌ఈ లేఖ రాశారు. అయితే ఈఈ నుంచి స్పందన లేకపోవడంతో మరోసారి ఎస్‌ఈ ఇదే అంశంపై ఈఈకు మరో మెమో ఇచ్చా రు. దీన్ని అతి ముఖ్యమైన అంశంగా భావించి వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేందుకు పైఅధికారులకు లేఖ రాస్తామని ఎస్‌ఈ హెచ్చరించారు. కాగా ప్యాకేజీ-1 పనులకు సంబంధించి మరో వివాదా స్పద నిర్ణయం బయటకొచ్చింది. సాధారణంగా ప్రభుత్వం ఒక వర్కును ఫైనాన్స్ శాఖ అప్రూ వల్‌తో ప్రీక్లోజ్ చేశాక కింది స్థాయి అధికారులు దాన్ని రివైజ్ చేయడం వీలుకాదని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ రివైజ్ చేయాలంటే మళ్లీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అప్రూవల్ అవసరమవుతుందని అంటున్నారు. కానీ ప్యాకేజీ-1 విషయంలో ప్రభుత్వం ప్రీక్లోజ్ చేస్తూ జీవో ఇచ్చిన రెండేళ్ల తర్వాత తిరుపతి సీఈ ఎస్టిమేషన్లు రివైజ్ చేశారు. రూ.308 కోట్ల అగ్రిమెంటు వ్యాల్యూను రూ.408 కోట్లకు పెంచారు. మరి ఈ రివైజ్ అన్నది ప్రభుత్వ అనుమతితోనే జరిగిందా..? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

అయితే ఇందుకు సంబంధించి డాక్యుమెంట్లు అడుగుతున్నా ఇరిగేషన్ అధికారులు బయటపెట్టక పోతుండడం పలు అనుమానాలకు బలం చేకూరు స్తోంది. విచారణ జరిగితే వాస్తవాలు వెలుగు లోకి వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహా రంపై ఇరిగేషన్ ఎస్‌ఈ దేశా నాయక్‌ను వివరణ కోరగా ప్యాకేజీ-1కు సంబంధిం చిన రికార్డులు అప్పగించా ల్సిందిగా సెంట్రల్ డివిజన్ ఈఈకు మెమో ఇచ్చామని చెప్పారు. అక్కడి నుంచి స్పందన రాకపోవడంతో మరోసారి కూడా మెమో ఇచ్చామని, ఆ తర్వాత కూడా రికార్డులు ఇవ్వకుంటే తామే వెళ్లి స్వాధీనం చేసుకుం టామని పేర్కొన్నారు.

మాల కొండ హుండీ ఆదాయం రూ.82 లక్షలు

5 లో..

సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

- అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి
- కలెక్టర్ ఆనంద్ ఆదేశం

నెల్లూరు (హరనాథ పురం) మార్చి 28 (ఆంధ్ర జ్యోతి): సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు ఎలా చేరు తున్నాయో తెలుసుకు నేందుకు ప్రభుత్వం వారి నుంచి అభిప్రాయాలను సేకరిస్తు న్నదని కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో ఈ అంశమై అధికారులతో ఆయన సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు సమర్థవం తంగా పనిచేస్తూ ప్రజా మన్ననలను పొందాలని తెలిపారు. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను ఐవీ ఆర్ కాల్స్, క్యూఆర్ కోడ్, వాట్సప్‌ల ద్వారా తెలుసుకుంటుందన్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు ఎంత మంచి సేవలు అందుతున్నాయో తెలు సుకుని, మరింత మెరుగు పరచడానికే ఈ అభిప్రాయ సేకరణ అని పేర్కొన్నారు. ప్రతి వారం ఒక్కో అంశంపై అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. నాలుగు వారాల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. అభిప్రాయాలు వెలిబుచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వివరించారు. వైద్యశాలలో పేదలకు అందించే సేవలు, పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసే నిత్యావసరాలు, ఆర్టీసీ బస్సుల సమయపాలన, అన్న క్యాంటీన్లలో అందజేసే ఆహార పదార్థాల నాణ్యత, ఆలయాల్లో ప్రసాదాల నాణ్యత తదితరాల అంశాలపై వచ్చే ప్రజాభిప్రాయానికి అనుగుణంగా తగిన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతినెలా ఈ అంశాలపై సమీక్ష చేస్తామన్నారు. సమావేశంలో ఎన్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ, అడిషనల్ ఎస్పీ సౌజన్య, డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, డీఎంహెచ్‌వో సుజాత, డీసీహెచ్ ఎస్.శేషారత్నం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.27 (శనివారం సాయంత్రం)

సహరి : 4.50 (ఆదివారం ఉదయం)



కస్తూరిదేవి గార్డెన్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో దువా చేస్తున్న మంత్రి ఆనం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి, కలెక్టర్ ఆనంద్, తదితరులు

ముస్లింలకు అండగా ప్రభుత్వం

- మంత్రి రామనారాయణరెడ్డి

నగరంలో ఘనంగా ఇఫ్తార్ విందు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ముస్లింలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 441 మసీదుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.3.96లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. 852 మంది ఇమామ్‌లు, మౌజన్ల జీతాల కోసం రూ.66.15లక్షలు మంజూరు చేసిందన్నారు. అబ్దుల్ అజీజ్ కు వక్ఫ్‌బోర్డు పదవి ఇచ్చి మైనార్టీలకు సముచిత గౌరవం ఇచ్చామన్నారు. కోటమిట్ట షాదీమంజిల్‌లో ఫర్నీ చరుకు తన సొంత నిధులు ఖర్చు చేస్తామని నారాయణ తెలిపారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లా డుతూ దేశంలో ఏమి జరుగుతున్నా రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు ముస్లింలకు అండగా ఉన్నారని ముస్లింలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

- భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

ఈ సందర్భంగా కస్తూరిదేవి గార్డెన్స్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందు జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ ఓ.ఆనంద్, నగర కమిషనర్ సూర్యతేజ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు నన్నేసాహెబ్, బ్రహ్మంగుప్తా, రాజానాయుడు, జలదంకి సుధాకర్, షంషుద్దీన్‌లతో బాటు పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పర్యవేక్షించారు.



ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు

'ఇండోసోల్'కు భూములు

- కరేడు పరిసరాల్లో 8,348 ఎకరాల సేకరణకు ప్రభుత్వం నిర్ణయం
- ఏపీఐఐసీకి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు
- ఏపీ మారిటైమ్ బోర్డు నుంచి నిధుల బదలాయింపునకు నిర్ణయం
- చెరువు నీరు పరిశ్రమలకు కేటాయింపు
- గ్రామ పరిధిలో 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్
- ఆగ్రహిస్తున్న గ్రామస్థులు
- పోరాటానికి సిద్ధమంటున్న రైతులు

కందుకూరు/ ఉలవపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ పరిశ్రమకు అవసరమైన భూముల సేకరణకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో ఇప్పటి వరకు సాగిన ఊహాగానాలకు తెరపడినట్లైంది. మండలంలోని కరేడు గ్రామంతోపాటు మన్నేరు వాగుకు అవతలివైపు ఉన్న ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం బింగినపల్లి గ్రామం భూములను కలుపుకొని 8348 ఎకరాలు కేటాయించినట్లు ఆ జీవోలో పేర్కొన్నారు. ఇప్పటికే గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో 114 ఎకరాల భూమి కేటాయించారు. దీంతో కార్యాలయం, ఎక్యూప్‌మెంట్స్ నిల్వలు, సిబ్బంది క్వార్టర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటుకు రూ. 69,000 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ పరిశ్రమ పూర్తయితే ప్రత్యక్షంగా 13,050 మంది యువతకు, పరోక్షంగా మరికొంతమందికి ఉపాధి లభించనున్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా కరేడు గ్రామ పరిధిలో 12,000 ఎకరాల భూములు ఉండగా, వాటిలో కొన్ని మాగాణి భూములుకాగా, తీర ప్రాంతం భూముల్లో వేరుశనగ, మామిడి సాగు చేస్తున్నారు. ఇండోసోల్ పరిశ్రమవారికి 8348 ఎకరాలు భూమిని ఇస్తే గ్రామాలే మిగిలిపోతాయి, కాలక్రమేణా ఆ గ్రామాలను కూడా ఖాళీ చేయించి వాటి నామరూపాలు లేకుండా చేస్తారనేది గ్రామస్థుల భయాందోళన.

ప్రజాభిప్రాయం అవసరం లేదా..?

భారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నప్పుడు ఆ ప్రాంతం లోని ప్రజల అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం లేదా... అని కరేడు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సభ నిర్వహించి ప్రజల మనోభావా లను అర్థం చేసుకొని ప్రభుత్వం తలపెట్టిన పరిశ్రమ వల్ల లాభనష్టాలు, ప్రజల అనుమానాలు తీర్చకుండా భూములు బలవంతంగా లాక్కోవాలని చూస్తున్నదని మాజీ ఎంపీటీసీ, బీసీ సంఘం నాయకుడు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండోసోల్ పరిశ్రమకు ప్రభుత్వం భారీ రాయితీలు ఇస్తూ, పచ్చటి, సారవంతమైన భూములు అప్పచెప్పా లని చూస్తున్నదని, ఈ నియంతృత్వ ధోరణిని ఎదుర్కో నేందుకు త్వరలోనే భారీ ఉద్యమం చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భూ సేకరణ బాధ్యతలు ఏపీఐఐసీకి ..

రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల భూసే కరణ బాధ్యతలను ఇప్పటివరకు ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారానే జరుగుతున్నాయి. అయితే ఇండోసోల్ పరిశ్రమలకు భూములను సేకరించే బాధ్యతను మాత్రం ఏపీఐఐసీకి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భూసేకరణ నిబంధనలకు అనుగుణంగా ఏపీఐ ఐసీ రైతుల నుంచి భూములను సేకరిస్తుందని, ఎవరైనా రైతులు భూములు అమ్మేందుకు విముఖత చూపితే వారివద్ద లీజుకి తీసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. భూములిచ్చే రైతులకు ఏటా రూ. 31300 లీజు చెల్లించేలా ప్రతి రెండేళ్లకు ఐదు శాతం పెంచు కుంటూ పోయేలా ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

చెరువు నీరు వినియోగం

కరేడు చెరువు ఆయకట్టు భూమినంతటినీ భూసేక రణలో తీసుకోనున్నందున కరేడు చెరువు నీటిని ఈ పరిశ్రమలకు కేటాయించనున్నట్లు కూడా ఆ ఉత్తర్వుల్లో స్పష్టతనిచ్చారు. అలాగే చేవూరు పరిధిలో ఇప్పటికే ఏర్పాటై ఉన్న 114.5 ఎకరాల్లోని మాడ్యూల్స్ తయారీ ప్లాంట్‌కు అవసరమైన నీటిని చేవూరు చెరువు నుంచి ప్రతిరోజు 7 మిలియన్ లీటర్లు వాడుకునేలా అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు.

- విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు

ఇండోసోల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్ లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పంపిణీచేసేందుకు వీలుగా ఏపీ ట్రాన్స్‌కో ద్వారా అక్కడ 220కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయ టంతో పాటు తదనుగుణంగా అవస రమైన అన్నిచర్యలు తీసుకునే బాధ్య తలను ఏపీ ట్రాన్స్‌కోకు అప్పగిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భూములు కాపాడుకుంటాం



కరేడులోని సారవంతమైన భూములు వదులుకోవడం గ్రామ స్థులకు ఇష్టం లేదు. పంచాయతీ పరిధిలోని మత్స్యకారులు, పల్లెకా రులు, ఎస్టీల అభిప్రాయం సేకరించకుండా దౌర్జన్యంగా భూములు లాక్కోవాలని చూడడం దారుణం. ప్రజా ఉద్యమాన్ని చేపట్టి భూములు కాపాడుకుంటాం.

- మిరియం శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ, కరేడు

ఐక్యంగా పోరాడుతాం...



ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న గ్రామాన్ని పరిశ్రమల పేరిట కలుషితం చేస్తున్న ప్రభుత్వం చర్యలను వ్యతిరేకిస్తున్నాం. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను కోల్పోవడానికి సిద్ధంగా లేం. గ్రామస్థులంతా ఐక్యంగా పోరాడుతాం.

- వాకా రాజశేఖర్‌రెడ్డి, రైతు, కరేడు

భూములు లాగేసుకుంటే మా పరిస్థితి ఏమిటీ ?



మత్స్యకార గ్రామాలైన టెంకా యచెట్లపాలెం, అలగాయపాలెం, కొత్తపల్లెపాలెం గ్రామాల్లో వేరుశనగను నమ్ముకొని ఏడాదికి రెండుసార్లు పంటలు సాగు చేస్తున్నాం. ఇప్పుడు పరిశ్రమల పేరిట భూములు లాగేసుకుంటే మా పరిస్థితి ఏమిటీ ? మా భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేం.

- వాయిల శ్రీను, వేరుశనగ రైతు, టెంకాయచెట్లపాలెం, కరేడు పంచాయతీ

ఉగాది నాడు అర్చకులకు సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీవిశ్వావసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా స్థాయిలో ముగ్గురు అర్చకులు, ఒక వేద పండితునికి ఉగాది పురస్కారం అందజేస్తున్నట్లు దేవదాయ శాఖ జిల్లా సహాయ కమి షనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జొన్నవాడ కామాక్షితాయి ఆలయ వేద పండితుడు టీ పవన్ కుమార్‌శర్మ, అర్చకులు యూ నందకిషోర్ (ఇందుకూరుపేట, కొత్తూరు వీరాంజనే య స్వామి ఆలయం), ఏ రామకృష్ణ (సోమశిల సోమేశ్వరాలయం), టీ వెంకటేశ్వర్లు (గొలగమూడి వీరాంజనేయస్వామి ఆలయం)ను ఎంపిక చేశామని తెలిపారు. వీరిని రూ.10వేల నగదు పారితోషికం, పట్టువస్త్రాలతో సన్మానిస్తామని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని ప్రతీ ఆలయంలో విశేష పూజలు, పంచాంగ శ్రవణం, వాహన సేవలతోపాటు అర్చకులకు సన్మానాలు జరుగుతాయని తెలిపారు.

ఊరూరా టీడీపీ జెండా ఎగరాలి

కలువాయి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించాలని మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు నాయుడు పిలుపునిచ్చారు. కలువాయిలో జరుగు కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, సీనియర్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8568
వెండి కిలో ధర	రూ. 1,03,600
వెండి ఒక గ్రాము	రూ.106.60

న్యూస్ బాక్స్

రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు దేవరబోడుపై ఉన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు స్వామివారికి గణపతి పూజ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం పొంగళ్లు, స్వామి వారి కల్యాణోత్సవం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, మంగళవారం స్వామి వారి గ్రామోత్సవం జరుగు తుందన్నారు.

సంతాన లక్ష్మికి ప్రత్యేక పూజలు

ఉదయగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీలో సమీపంలో ఉన్న సంతానలక్ష్మి ఆలయంలో శుక్రవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

ఉదయగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం మండలంలోని బూత్ లెవల్ అధికారులతో రీసర్వే డీటీ జహీర్‌బాబు, ఎన్నికల సీనియర్ సహాయకులు అర్షద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పిం చాలన్నారు. ఓటరు జాబితాలో మరణిం చిన వారు, డబుల్ ఎంట్రీలను తొలగించాలన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి

ఉదయగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఎస్‌ఏ-2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. శుక్రవారం మండలంలోని గుడినరవ, సున్నంవారిచింతల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 10, 11, 12 గంటలకు వాటర్‌బెల్ మోగించి విద్యా ర్థులంతా మంచినీరు తాగేలా చూడాలన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ఉదయగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో శనివారం నిర్వహించే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు. కావున మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

జనసేనలో పలువురి చేరిక

అనంతసాగరం మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాల యంలో శుక్రవారం జనసేన పార్టీ కార్య కర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆత్మకూరు నియోజక వర్గ సమన్వకర్త నలిశెట్టి శ్రీధర్, ఇతర నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించగా జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కంటే శ్రీనివాస్ భరత్, మండల పార్టీ అధ్యక్షుడు ఉదయగిరి రవి, ముత్తం కృష్ణ, నరసింహరాయల్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పునాదులకే పరిమితమైన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం



పునాదుల స్థాయిలో నిలిచిపోయిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

సంగం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన పంచాయతీలో గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థలో భాగంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌కు రూ. 25 లక్షలు నిధులు మంజూరుకాగా, రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ పునాదుల వరకు నిర్మించి ఆ తరువాత రెండేళ్ల పాటు పనులను నిలిపివేసినా అధికారులు పట్టించుకోలేదు. ఇంతలో ఎన్నికలు రావడంతో వైసీపీ అధికారం కోల్పోయి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో విలేజ్ క్లినిక్‌ను నిర్మిస్తారా.. లేదా అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

మరమ్మతులకు నోచుకోని చేతిపంపులు

- తాగునీటి కోసం గ్రామస్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



ఇర్లపాడు గ్రామంలోలో మరమ్మతులకు నోచుకోని చేతి పంపు

మర్రిపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేతిపంపులు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో తాగునీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఆత్మకూరు నియోజక వర్గంలో 3076 చేతి పంపులు ఉండగా వీటిలో సుమారు 450 వరకు అలంకార ప్రాయంగా మారాయి. మరమ్మతులకు గురైన చేతి పంపులను అధికారులు పట్టించుకోవటంలేదన్న వి మర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదిగా వర్షాభావ పరి స్థితులతో భూగర్భ జలాలు అడుగంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో చేతిపంపులే ప్రత్యామ్నాయం. నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో 136 పంచాయతీలు ఉండగా మర్రిపాడు మండలంలో 761, అనంతసాగరంలో 552, ఆత్మకూరులో 253, ఏఎస్‌పేటలో 472, చేజర్లలో 439, సంగంలో 199 చేతిపంపులు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా సీసీ రోడ్డులో కలిసిపోయాయి. అంతేగాక గ్రామానికి వెలుపల ప్రధాన రహదారి పక్కనే ఉన్న చేతి పంపులు మరమ్మతులకు గురికావడంతో ప్రయాణి కులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా, మెకానిక్‌లు ఎంపీడీవో పరిధిలో పని చేస్తున్నారు. ప్రజలు, సిబ్బంది నుంచి అందే సమాచారంతో ఆయా గ్రామాలకు వెళ్లి వాటిని బాగు చేస్తున్నారు. ఈక్రమంలో మెకానిక్‌లకు సహాయ కులు లేకపోవటంతో గ్రామస్థులే సహాయంగా ఉంటున్నారు. దీనిపై మర్రిపాడు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ కృష్ణని వివరణ కోరగా.. వేసవిలో ప్రజలకు ఎలాంటి నీటిసమస్య తలెత్తకుండా తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

ఉద్యోగుల పనితీరుపై ఉన్నతాధికారుల ఆరా

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న పలు శాఖల ఉద్యోగుల పనీతీరుకు సంబంధించి శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ఆ సచివాలయానికి మహిళా పోలీసే దిక్కు' అనే శీర్షికన కథనం ప్రచురితం అయింది. దీంతో స్పందించిన డీఎల్‌డీవో విజయకుమార్ ఉద్యోగుల పనీతీరుపై ఆరా తీశారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రావు ఆదేశాల మేరకు కార్యాలయ ఉద్యోగులు, సచివాలయ డీడీవో మహేష్ నుంచి నివేదికలు అందుకున్నారు. అనంతరం సమగ్ర విచారణ చేపట్టి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి సీడ్స్ సంస్థ సహకారం



పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బంది

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయానికి సీడ్స్ స్వచ్ఛంద సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని ప్రకృతి వ్యవసాయాధికారి రవిచంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బ్రహ్మేశ్వరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడ్స్ సిబ్బంది వేణు, గంగాధర్‌రెడ్డి, రైతు సాధికారత సంస్థ సిబ్బంది సురేష్, రోషిణి, ప్రియాంక, శాంతమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ



ఉపకరణాలు అందిస్తున్న ఎంఈవో, తదితరులు.

కలువాయి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక అవసరాలు కల్గిన చిన్నారులకు అలింకో, సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ఉపకరణాలు పంపిణీ చేశారు. బ్యాటరీ ట్రైసైకిల్, హియరింగ్ కిట్లు మండల విద్యాశాఖాధికారి జీ శేషగిరిరావు, ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ ఆలీ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ఏవీ ప్రసన్నలక్ష్మీ, ఐఈఆర్టీలు ఏ భానుప్రియ, విశ్వ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్

ఉదయగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అకడమిక్ ఆడి ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆడి ట్ బృంద సభ్యులు డాక్టర్ కె సుదర్శన్‌కుమార్, షేక్ తమన్నా కళాశాలకు చేరుకుని అన్ని విభాగాలను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. ఆడిట్ నివేదికను కళాశాల ఉన్నత విద్యా డైరెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ నారాయణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ ఏ నరసింహులు, ఐక్యూసీ కోఆర్డినేటర్ కేసీ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణాచార్యులకు ఘన నివాళి

స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో శుక్రవారం పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ గోపికృష్ణ, రఘునాథ్‌రెడ్డి, సునీత, దుర్గాప్రసాద్, రమేష్, కిషన్‌తేజ, కమలప్రియ, ధనుంజయ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా మార్చురీ స్థలం కబ్జా

- పట్టించుకోని అధికారులు



మార్చురీ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేస్తున్న కంచె

ఉదయగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారులు మార్చురీ స్థలాన్నీ వదల్లేదు. ఏకంగా కబ్జా చేసి కంచె వేసిన సంఘటన ఉదయగిరి పట్టణం మంగళకట్టవీధిలో శుక్రవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి బ్రిటీష్‌వారి పాలనలో మంగళకట్టవీధిలో సుమారు 50 అంకణాల స్థలాన్ని కేటాయించారు. గతంలో అక్కడే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేవారు. ప్రస్తుతం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతన మార్చురీ భవనం ఏర్పాటు చేయడంతో వైద్యశాలలోనే పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. దీంతో గత కొన్నేళ్లుగా పాత మార్చురీ గది నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. కాగా, పాత మార్చురీ భవనం ఉండే ప్రాంతంలో స్థలాలకు మంచి డిమాండ్ ఉండడంతో ఆస్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. ఏకంగా స్థలాన్ని చదును చేసి కూలీలతో ఇనుప కంచె వేస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కంచె వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విలువైన మార్చురీ స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై సామాజిక ఆరోగ్య కేంద్ర డీడీవో డాక్టర్ ప్రశాంత్‌ను వివరణ కోరగా విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే స్థలాన్ని పరిశీలించానన్నారు. కబ్జా విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మండలాలను అభివృద్ధి పథంలో నడిపించాలి

- ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ట్రాక్టర్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గంలో మండలాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులకు సూచించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ ప్రధాన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయగిరి నియోజక వర్గంలో మండలాల ప్రజాపరిషత్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్‌లో వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. ఉపాధిహామీ పథకం కింద చేసే ప్రతి పని ప్రజలకు ఉపయోగపడాలన్నారు. ఈకార్యక్రమంలో 8 మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, టీడీపీ మండల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ట్రాక్టర్ల పంపిణీ

మండలంలోని చాకలికొండ, కాటేపల్లి పంచాయతీలకు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా రెండు ట్రాక్టర్లను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్యే సతీమణితోపాటు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, చాగలకొండ సర్పంచ్ కుమారి సుబ్బలక్ష్మీ, కాటేపల్లి సర్పంచ్ విజయలక్ష్మమ్మ, డాక్టర్ వెంకటేశ్వర్లు, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, టీడీపీ మండల కన్వీనర్ గొంగటి రఘు, జిల్లా కార్యదర్శి చల్లా వెంక టేశ్వర్లుయాదవ్, పంచాయతీ కార్యదర్శులు శేఖర్, షరీఫ్ పాల్గొన్నారు.

కోటి తలంబ్రాలు ర్యాలీకి ఆహ్వానం

అయోధ్య భద్రాచలం, ఒంటిమిట్ట పుణ్యక్షేత్రాలలో జరుగు సీతారాముల కల్యాణ మహోత్సవ కోటి తలంబ్రాల ర్యాలీ కార్యక్రమానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను ఉదయగిరి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ కదిరి రంగారావు, సురేఖ దంపతులు శుక్రవారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు మేకపాటి మాల్యాద్రి నాయుడు, భక్తబృందం పాల్గొన్నారు.

పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ

సీతారామపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై దృష్టి సారించి అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని ఈవోపీఆర్డీ భార్గవి సూచించారు. మండల కేంద్రంలోని బిట్ -1 సచివాలయంలో ఈవోపీఆర్డీ అధ్యక్షతన శుక్రవారం సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ భార్గవి మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వసూలైన ఇంటిపన్ను వివరాలను స్వర్ణ పంచాయతీలో అప్లోడ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతా రామపురం సర్పంచ్ భాగ్యకుమారి, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు రామనాథరెడ్డి, జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలు సద్వినియోగం చేసుకోండి

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించేందుకు సహకార వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని, అందులో భాగంగా సొసైటీల్లో ఆన్‌లైన్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక కమ్మవారిపాళెం సొసైటీ మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మవారిపాళెం సొసైటీలో ఈనెల 20వ తేదీ నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, సొసైటీకి సంబంధించిన అన్ని లావాదేవీలు ఇకనుంచి ఆన్‌లైన్ ద్వారా జరుగుతాయని, మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సొసైటీకి సంబంధించిన జమా, ఖర్చులను పరిశీలించి అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేసి ఆమోదించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో లోక్‌నాథ్ రెడ్డి, సంఘం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి



ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ సభ్యులు

ఉదయగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజారవాణా శాఖలో సాంకేతిక కారణాలతో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంలో మూడేళ్ల నుంచి జాప్యం జరుగుతోందని, వెంటనే పదోన్నతులు కల్పించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి జీ నారాయణరావు కోరారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో డిపో ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ ఎంపిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు చాలామంది పదోన్నతులు పొందలేక ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఇంధన పొదుపులో వెనుకబడి ఉన్నారని కండక్టర్లు, డ్రైవర్లపై అధికారుల వేధింపులు మానుకోవాలన్నారు. రూట్‌సర్వేలు జరిపి ప్రభుత్వ సహకారంతో అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎంపిక

ఎంపాయిస్ యూనియన్ డిపో అధ్యక్షుడిగా షేక్ మహ్మద్‌రఫీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీవీ కృష్ణయ్య, కార్యదర్శిగా పెంచలయ్య, జాయింట్ సెక్రటరీగా గోపాలకృష్ణ, సభ్యులుగా వెంకటేశ్వర్లు, నాయబ్‌రసూల్, అశ్వనీకుమార్, ఎస్‌కేఎం బాషాలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు మాల్యాద్రి, రమేష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి : ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్

ఆత్మకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ పంచాయతీల్లో సర్పంచులతో కలిసి ప్రణాళిక తయారు చేసుకోవాలని, లీకేజీ ద్వారా నీరు వృథాగా పోతున్నట్లైతే వెంటనే అరికట్టాలని, చేతి పంపులు, మోటార్ పంపులు మరమ్మతులకు గురైతే త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలని, రికార్డుల నిర్వహణ తప్పనిసరి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ డేవిడ్‌రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

అప్పుల బాధతో బేల్దారి మేస్త్రీ ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ బేల్దారి మేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరులోని దర్గామిట్టలోని పోలీసు కాలనీలో డీ అనిల్‌కుమార్(39), మానస దంపతులు నివసిస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనిల్‌కుమార్ బేల్దారి పనులు చేసు కుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పులు చేయడంతో ఆ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇటీవల అప్పుల బాధలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు అనిల్‌కుమార్ ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి జీజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అనిల్ తల్లి నారాయణమ్మ శుక్రవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వృద్ధురాలు...

నెల్లూరులోని కరెంటాఫీసు గేటు సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వృద్ధురాలు రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... 70 నుంచి 75 ఏళ్లలోపు వృద్ధురాలు మరణించింది. మెడలో ఎర్రని దారం ఉంది. మృతదేహానికి సమీపంలో ఎర్రటి దుప్పటి పడి ఉంది. నెల్లూరు రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ములుముడి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ములుముడి గ్రామం (నరసింహకొండవైపు) పంట పొలాల వద్ద ఓ వ్యక్తి మృతదేహాన్ని రూరల్ పోలీసులు శుక్రవారం గుర్తించారు. 40 ఏళ్ల వయసున్న వ్యక్తి పంట కాలువలో నీటికోసం దిగి అందులోపడి ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. గురువారం ఈ ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గుంజి వేణు వెల్లడించారు.

చికిత్స పొందుతూ మరొకరు..

వెంకటాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విషపూరిత మందు ప్రభావంతో స్పృహ కోల్పోయిన మండలంలోని కాకుటూరు గ్రామానికి చెందిన పాశం శీనయ్య (42) రెండురోజుల కిందట నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మరణించాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు.

సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌గా గాలి రామకృష్ణారెడ్డి

- మూడో జాబితాలో జిల్లా నుంచి ఒక్కరే ఎంపిక



మనుబోలు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం మూడో విడత నామినేటెడ్ పోస్టుల జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలో సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌గా మనుబోలు మండల టీడీపీ అధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డిని ఎంపిక చేశారు. మొదట విడతగా గత ఏడాది సెప్టెంబరులోనూ, రెండోవిడతగా నవంబరులోనూ కొన్ని కార్పొరేషన్లను, ఇతర పదవులను పార్టీనేతలకు, కార్యకర్తలకు కట్టబెట్టారు. తాజాగా మూడో జాబితాను ప్రకటించారు. మొదటి విడతలో జిల్లాలోని టీడీపీ నేతలు ఆనం వెంకటరమణారెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి,కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిలకు టీడీపీ తరఫున, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి బీజేపీ తరఫున, వేములపాటి అజయ్‌కుమార్‌కు జనసేన తరఫున పదవులు దక్కాయి. రెండువిడతలో అబ్దుల్ అజీజ్‌కు పదవి వరించింది. మూడో విడతలో రామకృష్ణారెడ్డి ఒక్కరికే పదవి దక్కడం విశేషం. టీడీపీ శుక్రవారం విడుదల చేసిన మూడో విడత నామినేటెడ్ పోస్టుల జాబితాలో సర్వేపల్లి నియోజకవర్గానికి మాత్రమే చోటు దక్కింది. సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌గా మనుబోలు మండల టీడీపీ అధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డిని నియమిస్తున్నట్లు టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది. మనుబోలు మండలం పిడూరుపాళెం గ్రామానికి చెందిన ఆయన ఎన్నో ఏళ్లుగా టీడీపీలో కొనసాగుతున్నారు. గత ఆరేళ్లుగా మండలాధ్యక్షుడిగా కొనసాగుతూ, గత ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం బాగా శ్రమించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొద్ది నెలల క్రితం ఏఎంసీ చైర్మన్‌గా గాలిని ప్రతిపాదిస్తూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధిష్ఠానానికి ప్రతిపాదనలు పంపారు. తనకు పదవివచ్చేలా కృషిచేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి ఈ సందర్భంగా గాలి కృతజ్ఞతలు తెలిపారు. దీంతోపాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు రామకృష్ణారెడ్డికి అభినందనలు తెలిపారు.త్వరలో ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు.

కావలిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు కృషి

- బార్ అసోసియేషన్ వార్షికోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తులు



ఏపీ బార్ అసోసియేషన్ మెంబర్‌ను సత్కరించిన న్యాయవాదులు

కావలిరూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కావలిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు కొనకంటి శ్రీనివాసులురెడ్డి, కుంబజడల మన్మధరావు పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టుఆవరణలో శుక్రవారం రాత్రి కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బార్ అసోసియేషన్ వార్షికోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు పుస్తకాలు ఎంత బాగా చదివితే అంత ఎదుగుతారన్నారు. కేసులపై బాగా స్టడీ చేసి సంబంధిత డాక్యుమెంట్లు ప్రొడ్యూస్ చేస్తే మంచి ఆర్డర్లు వస్తాయన్నారు. కావలిలో స్నేహపూరిత వాతావరణం ఉంటుందని, అందువలన ఇక్కడ పనిచేసిన అధికారులు మరోచోటకు వెళ్లేందుకు ఇష్టపడరన్నారు. సూర్యుడి నుంచి శక్తి గ్రహించే పొద్దుతిరుగుడు పువ్వులు ఆకాశం మేఘావృతమైనప్పుడు ఒకదాని వైపు మరొకటి తిరిగి శక్తిని పొందుతాయని అలాగే న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచెయ్యటం ద్వారా న్యాయబద్ధమైన తీర్పులు వెలువడుతాయని పేర్కొన్నారు. న్యాయమూర్తి మన్మధరావు మాట్లాడుతూ నా విద్యార్థి జీవితం కావలితో ముడిపడి ఉందన్నారు. విశ్వోదయ బాలుర పాఠశాలలో 10వ తరగతి, జవహర్ భారతి కళాశాలలో ఇంటర్ చదివానన్నారు. ఇక్కడ పూర్వ విద్యార్థిగా తిరిగిన నేను తిరిగి హైకోర్టు న్యాయవాదిగా రావటం ఆనందంగా ఉందన్నారు. బార్‌లో 31 ఏళ్లు న్యాయవాదిగా కష్టపడి పనిచేశానని 3ఏళ్ల నుంచి న్యాయమూర్తిగా ఉంటున్నానన్నారు. 3ఏళ్లలో న్యాయమూర్తిగా 12వేల కేసులు పరిష్కరించాన్నారు. కేసుల అప్పీలుకు 60కి.మీటర్ల దూరంలోని నెల్లూరుకు వెళ్లాల్సి వస్తుందని, ఏడీజే కోర్టు కావలిలో ఏర్పాటు చెయ్యాలని స్థానిక బార్ అసోషియేషన్ నాయకులు కోరారు. అనంతరం నృత్యంతో అలరించిన చిన్నారి మేఘశ్రీని సన్మానించి అభినం దించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి సి.యామిని, అదనపు న్యాయాధికారులు సుమ, గీత, షమ్మీ సర్వీన్ సుల్తానా, కెవి ఎన్. పవన్, పాండురంగారెడ్డి, సరస్వతి, ఏపీ బార్ అసోసియేషన్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, కావలి న్యాయాధికారి ఎం.శోభ, సుధాకర్‌రావు, సీనియర్ న్యాయవాదులు పొట్లూరి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 440



గర్భిణులకు ఐరన్, ఫోలిక్ సిరప్ పంపిణీ

కావలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు రక్తహీనతను అధిగమించడానికి ఐరన్, ఫోలిక్ సిరప్‌లను పంపిణీ చేశారు. స్థానిక అరుంధతీవాడ -1, 2 అంగన్‌వాడీ కేంద్రాలలో జరిగిన ఈ కార్యక్రమాల్లో డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి పాల్గొని వేసవిలో గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ కార్యదర్శి బిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలత, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైస్ ఎంపీపీ ఎన్నిక మళ్లీ వాయిదా

దగదర్తి(బిట్రగుంట), మార్చి 28(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం రిటర్నింగ్ అధికారిగా సుబ్బరాజు నిర్వహించిన మండల ఉపాధ్యక్ష ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎంపీపీ, ఎంపీటీసీలు ఎవరూ రాకపోవడంతో ఎన్నిక వాయిదా వేశారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ రెండవ సారి ఎన్నిక వాయిదా పడిన విషయాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారికి నివేదిక అందిస్తామని, ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తేదీని ఖరారు చేసి అధికారకంగా తెలియచేస్తామన్నారు.

బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

కొండాపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.వెంకటరావు హెచ్చరించారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగులు, బుకీల కదలికలపై ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేశామన్నారు. వినోదం కోసమే క్రికెట్ చూడాలని బెట్టింగులవైపు ఆకర్షితులు కావద్దన్నారు. బెట్టింగ్ యాప్‌లపట్ల యువత, విద్యార్థులు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని తల్లిదండ్రులు గమనించాలన్నారు. బెట్టింగులు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే తమకు తెలియచేయాలన్నారు. బెట్టింగ్ నిర్వాహకుల చేతిలో మోసపోయిన వాళ్లు ఫిర్యాదు చేస్తే నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280

కలిగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 415 పొగాకు బేళ్ల అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో ఏడు కంపెనీల ప్రతినిధులు పాల్గొని 377 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-27, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 38 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.250, సగటు ధర రూ.272.94గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

యువతకు విద్యతో పాటు క్రీడలు అవసరం


బిట్రగుంట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): యువతకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని కళాశాల చైర్మన్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో 17వ క్రీడా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో పీడీ ఏ.కిరణ్‌కుమార్ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు జేబీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ పీ.ప్రసాద్‌రెడ్డితో కలసి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బహుతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆర్వీ.రమణారెడ్డి, అన్ని విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో రోస్టర్ విధానం అమలు చేయాలి

కందుకూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల్లో మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లగుంట మోహనరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ పర్రె వెంకటరావులు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను కేవలం మెరిట్ ప్రకారం తయారు చేశారని, ఈవిధంగా చేసినట్లైతే రిజర్వ్‌డ్ కేటగిరిలోని ఉపాధ్యాయులకు, అన్నివర్గాలలోని మహిళా ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సామాజిక న్యాయసూత్రానికి అనుగుణంగా అన్ని జిల్లాల్లో సీనియారిటీ జాబితాలను రివైజ్‌చేసి మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో రూపొందించాలని తెలిపారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ బహూకరణ

వలేటివారిపాలెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో కార్యాలయంలో గరుకుపాలెంకు చెందిన చిరిపిరెడ్డి వీరనారాయణ కుమార్తె (దివ్యాంగురాలు) చిన్నారికి ఆలింకో కంపెనీ వారి సహకారంతో రూ.9 వేలు విలుక కలిగిన వీల్‌చైర్‌ను ఆ సంస్థ ప్రతినిదులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ రవి, తదితరులు పాల్గొన్నారు.



వీల్‌చైర్ అందజేస్తున్న ప్రతినిధులు

- రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో విరగ పండిన వరి
- ఎకరాకు 45 నుంచి 58 బస్తాలు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో చేపట్టని కొనుగోళ్లు
- తక్కువ ధరకు దళారులకు విక్రయం
- మద్దతు ధర లేక నష్టపోతున్నామని రైతుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై పోసిన ధాన్యం, కాటా వేసి లారీకి లోడ్ చేస్తున్న కూలీలు

ఆశాజనకంగా ధాన్యం

దిగుబడులు!

లింగసముద్రం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో వరి పంట విరగ పండి ఆశాజనకంగా దిగుబడులు వచ్చాయి. ఎకరాకు 45 నుంచి 58 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నా మద్దతు ధర లేక ఆందోళన వ్యక్తమవుతోంది. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు ఒక్క గింజ రైతుల నుంచి కొనుగోలు చేయలేదు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందని ద్రాక్షాగా మ ఇగిలిపోయింది. విధిలేని పరిస్థితుల్లో దళారులు అడిగినకాడిన ధాన్యాన్ని తెగనమ్మి రైతులు దోపిడీకి గురవుతోన్నారు.

● దళారుల దోపిడీ

ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో గత ఏడాది నవంబరులో సుమారు 11 వేల ఎకరాల్లో కెఎన్ఎం 1638 వరి పైరు సాగు చేశారు. పెద్దగా తెగుళ్ల లేకపోవడంతో పాటు పైరుకు పుష్కలంగా నీరు లభించడంతో ఈనెల 15వ తేదీ నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఎకరాకు సుమారు రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. అయితే రైతుల కష్టాన్ని దళారులు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో ప్రభుత్వం ప్రకటించిన ఏ గ్రేడ్ రకం మద్దతు ధర 75 కేజీల బస్తా రూ.2,320, సాధారణ రకం రూ.2300 పొందలేక పోతున్నారు. పొలాల్లోనే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో వారు 75 కేజీల బస్తా ధాన్యానికి 4 కేజీల తరుగు, 1కేజీ గోతం తూకం కింద చేర్చి కేవలం రూ.1500 కొంటున్నారు. దీంతో దిగుబడులు బాగా వచ్చినా రైతుల కష్టమంతా దళారులు దోపిడీ చేస్తున్నారు.

గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్ట పోతున్నాం



వరి పైరు సాగుకు ఒక్కో ఎకరాకు సుమారు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు ఖర్చు చేశాము. తాను 4.50 ఎకరాలు సాగు చేశాను. ఎకరాకు 45 నుంచి 50 బస్తా వరకు దిగుబడి వచ్చింది. కానీ మద్దతు ధర లేక పోవడంతో పెద్దగా లాభాలు రాలేదు.

-తూమాటి గోవిందమ్మ,
మహిళా రైతు, చినపవని

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఉంటే బాగుండేది



ప్రభుత్వం సొసైటీల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి ఉంటే రైతులు మద్దతు ధర పొందేవారు. ఎకారకు రూ.40 వేల ఖర్చు అయినా లాభాలు బాగా వచ్చేవి. ప్రైవేటు వ్యాపారుల కు విక్రయించడంతో రైతులు నష్టపోతున్నారు.

- నర్సింశెట్టి మరళీకృష్ణ,
చినపవని

ఘనంగా 'టీఆర్ఆర్' వార్షికోత్సవం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న రామయ్య

కందుకూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల నాక్ ఏ ప్లస్ గ్రేడ్, స్వయం ప్రతిపత్తి హోదా సాధించాక నిర్వహించిన తొలి వార్షికోత్సవం ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో కోలాహలంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల అలుమ్ని అసోసి యేషన్ చైర్మన్, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రస్తుతం అంచలంచెలుగా ఎదుగుతూ రాష్ట్రంలోనే నెంబరు వన్ కళాశాలగా రూపుదిద్దుకోవడం అభినందనీయమని, కళాశాల అభివృద్ధికోసం తమవంతు తోడ్పాటునందించిన దాతలు, పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టరు వీవై కోటారెడ్డి మెమోరియల్ బంగారు పతకాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులు ఎస్కే ఉజ్మా, వై.స్నేహ, ఎం.రమణిలను అధ్యాపకులు అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ టీఆర్ఆర్ స్వయం ప్రతిపత్తి కలిగిన డిగ్రీ కళాశాలగా ఉండటమే గాక ఎక్కడా లేని మౌలిక సదుపాయాలు, ల్యాబ్‌లు, క్రీడాప్రాంగణం, లైబ్రరీ ఇక్కడ ఉన్నాయని, అత్యున్నత అర్హతలు కలిగిన అధ్యాపక బృందం, ప్లేస్‌మెంట్ విభాగాలు ఉన్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించగా విలియం షేక్స్పియర్ రచించిన హమ్లెట్ నాటక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ఓ.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు ఏడుకొండలు నరేంద్ర, ఎస్వీ శ్రీహరి, సుజాత, రాజగోపాల బాబు, కేవీ పద్మావతి, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

● సీపీఎం నేతల నిరసన



గుడ్లూరు విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

గుడ్లూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : పెరిగి విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు, టైమ్ ఆఫ్ డే ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకుడు గంటెనపల్లి వెంటకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడంతో సామాన్యుడికి భారంగా మారిందన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ మోసాలకు దార్లు వేస్తున్నారన్నారు. అసలు స్మార్ట్ మీటర్లు కావాలని ప్రజలు కోరలేదని, ఎవరి ప్రయోజనాలు కోసం వీటిని అమర్చుతున్నారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. విద్యుత్ సంస్కరణల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం అధిక భారాలను ప్రజలపై మోపి, సామాన్యుల నడ్డి విరిచిందని. ఆ పద్ధతినే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అవలంబిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దామా కృష్ణయ్య, మద్దిశెట్టి జాలయ్య, సుంకరి విజయలక్ష్మి, కొప్పోలు నారాయణ, నేలటూరి తిరుపాలు, కొట్టే వెంకయ్య, కొణిదల మాలకొండయ్య, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్కే ఖాదర్ బాషా, రాజగోపాల్, గుత్తి మల్లికార్జున, చెన్నయ్య తధితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

● తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు, సభ్యులు

ఉలవపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన మ్యానిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ప్రగతి శీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి వీ మంజుల డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్ర సమయంలో లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి అధికారంలోకి రాగానే ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలు విషయంలో కాలయాలపన చేస్తున్నారని విమర్శించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు మహేశ్వరి, సీహెచ్ యశోద, శివమ్మ, రెబకమ్మ, పద్మ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఆర్ మోహన్, రైతుకూలి సంఘం జిల్లా అధ్యక్షుడు నాంచార్లు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాసాలకు ప్రత్యేకత ఉంది



ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

● ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

కావలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలకు ఒక ప్రత్యేకత ఉందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. రంజాన్ మాసంను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటి ఆవరణలో ముస్లింలతో కలసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం మత పెద్దలను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో తన గెలుపు కోసం ముస్లింలు ఎనలేని కృషి చేశారని తెలిపారు. తాను బతికి ఉన్నంత కాలం ప్రతి రంజాన్ మాసంలో తన ఇంటి వద్ద ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ, డీఎస్పీ పీ.శ్రీధర్, వివిధశాఖల అధికారులు, జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్, టీడీపీ నేతలు, ముక్తీలు, మౌలానాలు, ఇమామ్‌లు, మౌజన్‌లు, మత గురువులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

దగదర్తి(బిట్రగుంట),(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడ్డ వారి కోసం అండగా ఉంటానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. దగదర్తి మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో నిర్మాణం పూర్తి అయిన అభివృద్ధి పనులను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. త్వరలో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గత వైసీపీ ప్రభుత్వ పాలనలో తెలుగుతమ్ముళ్లపై కక్షసాధింపు చర్యలు చేస్తుండటంతో టీడీపీ పాలన వచ్చేంత వరకు పాదరక్షలు వాడని శపథం చేసి, ప్రభుత్వం ఏర్పడ్డాక తిరుపతికి పాదయాత్ర చేసిన నాయకుడు తాళ్లూరు సుధాకర్ నాయుడుకి ఎమ్మెల్యే పాదరక్షలు అందజేసి అభినందించారు. కాట్రాయపాడు నుంచి యువత భారీ సంఖ్యలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలకు నిధులు మంజూరు చేయించానన్నారు. టీడీపీ క్రమశిక్షణతో ప్రజలకు పనిచేసే పార్టీ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో జిల్లా మంత్రుల సహకారంతో కావలి నియోజకవర్గాని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కాగా ఎమ్మెల్యేతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరిలను ధాన్యపు గజమాలతో స్థానిక రైతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు హనుమంతరావు, కండ్లగుంట మధుబాబు, జలదంకి శ్రీహరినాయుడు, బొట్టా మనోజ్, చెన్నూరు సర్పంచు పాపన మల్లికార్జునరెడ్డి, తాళ్ళూరు మోహన్‌రావు, కంచర్ల సుధాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పీజీ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కావలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కావలిలోని విక్రమసింహపురి పీజీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.సుశీల, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీ.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్‌తో కలిసి రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.శైలజ ప్రారంభించారు. అలాగే అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

మాలకొండ హుండీల లెక్కింపు

12 శనివారాలకు రూ.82,44,463 ఆదాయం



హుండీల్లో కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వలేటివారిపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామికి 36 హుండీల ద్వారా 12 శనివారాల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.82,44,463 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆలయ కల్యాణ మండపంలో కందుకూరు గ్రూప్-2 ఆలయం కార్య నిర్వాహణాధికారి రవీంద్రనాథ్ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఆ లెక్కింపులో పైన సూచించిన నగదుతో పాటు 178 గ్రాముల బంగారం, 1 కేజీ 5 గ్రాముల వెండి, 56 యూఎస్ డాలర్లు, 200 యూఏఈ దిహమ్స్, 700 ఒమాన్‌బైసా, 8 ఒమాన్ రియల్, 20 ఇంగ్లండ్ పౌండ్స్, నేపాల్‌కు చెందిన రూ.50 లభించినట్లు ఆయన తెలిపారు.

బకాయిలు చెల్లించకుంటే..

కరెంటు కట్ చేయరా మరి?

- ● రాళ్లపాడు ప్రాజెక్టు అతిథి గృహం బకాయిలు రూ.14 లక్షలు
- ● రెండేళ్ల కిందటే విద్యుత్ సరఫరా నిలిపివేత
- ● కన్నెత్తి చూడని అధికారులు
- ● అసాంఘికాలకు నిలయంగా మారిన వైనం



రెండేళ్ల నుంచి తలుపులు తెరుచుకోని రాళ్లపాడు అతిథిగృహం

లింగసముద్రం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు అధికారు లు గత కొన్నేళ్ల నుంచి విద్యుత్ బకాయిలను చెల్లించకపోవడంతో ట్రాన్స్‌కో శాఖ అధికారులు రెండేళ్ల కిందటే అతిథిగృహానికి విద్యుత్ కనెక్షన్ కట్ చేశారు. దీంతో ప్రాజెక్టు అధికారులు అతిథిగృహం వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ కారణంతో ఈ అతిథిగృహం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గతేడాది వరకు విద్యుత్ బకాయిలు సుమారు రూ.14లక్షలు ఉండేవి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో అధికారులు ఈ అతిథిగృహం వైపు కన్నెత్తి చూడటం లేదు.

● వినియోగంలో లేక కళతప్పిన అతిథిగృహం

1951లో ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పనులను పర్యవేక్షించే ఉన్నతా ధికారుల కోసం పెంట్రాలలో మొగిలిచెర్లకు వెళ్లే రోడ్డు పక్కన దీని నిర్మా ణం చేపట్టారు. ఆ సమయంలో కాపలాగా వాచ్‌మ్యాన్‌ను నియమించి ఆయనకు ఒక గది, వంట గదిని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నాలుగేళ్ల కిందట వరకు ప్రాజెక్టు అధికారులు, ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేల రాకపోకలతో రద్దీగా ఉండేది. ప్రాజెక్టు ఆయకట్టు రైతు ల సమావేశాలు కూడా అక్కడే జరుగుతుండేవి. ప్రాజెక్టు నుంచి వరద నీటిని మన్నేరుకు విడుదల సమయంలో కూడా ఉన్నతాధికారులు పనులను పర్యవేక్షించి, ఈ అతిథి గృహంలోనే సేద తీరేవారు. ప్రస్తుతం ఇక్కడికి రాకపో వడంతో అతిథి గృహం కళ తప్పింది. అలాగే కనీసం వాచ్‌మెన్లు, అటెండర్లు లేక పోవడంతో ఇది కాస్తా మందుబాబులకు అడ్డాగా మారింది.



శిథిలమైన అతిథి గృహంలో నిర్మించిన వాచ్‌మన్ గది, వంటగది

● అసాంఘిక పనులకు నిలయంగా..

ఈ సమస్యలతో అధికారులు రాక పోతుండడంతో అసాంఘిక పనులకు నిలయంగా మారింది. మందుబాబులు పగలు, రాత్రి తేడా లేకుండా ఈ ప్రాంతంలో మద్యం సేవించి సీసాలు ఇక్కడే పారవేస్తున్నారు. అలాగే రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు చీకటి పనులు కూడా చేస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా దీని పర్యవేక్షణను పట్టించుకోక పోతే శిథిలావస్థతకు చేరే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు టీవీ ప్రసాద్,తదితరులు

షుగర్ ఫ్యాక్టరీ భూమిని ఇవ్వడం తగదు

కోవూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కోవూరు షుగర్ ఫ్యాక్టరీ భూమిని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐఐసీ)కు ఇవ్వడం తగదని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై శుక్రవారం వారు స్థానిక సీతాపోలయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టీవీ ప్రసాద్ మాటాడారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయం లో చక్కెర కర్మాగారాన్ని పునఃప్రారంభిస్తామని వాగ్దానం చేసి కొత్త పరిశ్రమలకు ఫ్యాక్టరీ భూమిని కేటాయించడం తగదన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా చెరకు పండించేందుకు రైతులు ఇప్పటికీ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. విలువైన భూమిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తనాటకానికి తెరదీసిందన్నారు. జిల్లాలోని 15మండలాల్లోని గ్రామాల్లో 5,840మంది షేర్ హోల్డర్లు ఫ్యాక్టరీ భాగస్వాములన్నారు. షేర్ హోల్డర్ల హక్కును కాలరాసి సహకార రంగంలో కొనసాగే ఫ్యాక్టరీ భూమిని కార్పొరేట్‌శక్తులకు అప్పగించడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోనె దయాకరరావు, ముత్యాల గురునాథం, గండవరపు శ్రీనివాసులు, పులిగండ్ల శ్రీరాములు, గండవరపు శేషయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు శాశ్వత గుర్తింపు

- యూడీఐడీ పేరుతో కొత్త కార్డులు
- నేరుగా ఇంటికే చేరేలా ప్రణాళిక
- మీసేవ, ఇంటర్నెట్‌ల ద్వారా దరఖాస్తు
- దేశమంతా వర్తించేలా కేంద్రం చర్యలు
- తప్పనున్న 'సదరం' ఇక్కట్లు

సంగం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి శాశ్వత గుర్తింపు కార్డు జారీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. గతంలో దివ్యాంగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందచేసే సంక్షేమ పథకాల లబ్ధి పొందాలంటే సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. ఇందుకుగాను సచివాలయాల్లో స్లాట్ బుక్ చేసుకున్న వారికి నిర్దేశించిన వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి వైకల్యాన్ని నిర్ధారించి వైద్యులు సర్టిఫికెట్ జారీ చేసేవారు. ఆ సర్టిఫికెట్‌తో వారు బస్సు, రైల్వే పాసులకు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేవారు. ఉద్యోగాల ఇంటర్వ్యూల సమయంలో వెంట తీసుకెళ్లేవారు. ఈ సమస్యలకు చెక్ పెడుతూ కేంద్రం వీటి స్థానంలో యూడీఐడీ (యూనిఫైడ్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు)ని తీసుకొచ్చింది. త్వరలో ఈ ప్రక్రియను జిల్లాలో ప్రారంభించనున్నారు.

● దరఖాస్తు ఎలా అంటే...

మీసేవ, ఇంటర్‌నెట్, ఏపీ ఆన్‌లైన్, సీఎస్‌సీ, మొబైల్ ఆన్‌లైన్‌లో స్వావలంబన్ కార్డు జీవోవీ.ఇన్.వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఫారంలో సూచించిన అంశాలను పూర్తి సమాచారంతో పంపాలి. ఆ తరువాత దరఖాస్తు స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకునే వెసులుబాటు ఉంటుంది.

● యూనిక్ ఐడీతోనే గుర్తింపు

భవిష్యత్తులో యూనిక్ ఐడీని తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తుంది. ఈ కార్డులో ఆధార్, వైకల్య శాతం, ఇతర వివరాలను పొందుపరుస్తారు. ఈ ఐడీని స్కాన్ చేస్తే పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. ఇప్పటి వరకు సదరం సర్టిఫికెట్లు రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఐడీ కార్డులు మాత్రం దేశ వ్యాప్తంగా చెల్లుబాటు అవుతాయి.

● 2014లోనే శ్రీకారం

వాస్తవానికి 2014లో టీడీపీ ప్రభుత్వం ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టింది. సదరం సర్టిఫికెట్ స్థానంలో ప్రత్యేక కార్డును ప్రవేశపెట్టింది. ఈ కార్డులను జిల్లా విభిన్న ప్రతిభావంతుల కార్యాలయానికి పంపారు. అవి డీఆర్‌డీఏ శాఖకు అప్పచెప్పగా, వాటి బాధ్యత మెప్మాకు అప్పజెప్పారు. మెప్మా అధికారులు కొంత మందికి పంపిణీ చేసి, మిగిలిన వారికి ఇవ్వలేదు. కాకపోతే ఈ కార్డులో వైకల్య శాతం మినహా మిగిలిన వివారలను పొందుపరచలేదు. దీంతో ఈ కార్డుల పట్ల లబ్ధిదారులు ఆసక్తి చూపించలేదు.



● యునిక్ ఐడీతోనే గుర్తింపు

భవిష్యత్తులో యూనిక్ ఐడీని తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తుంది. ఈ కార్డులో ఆధార్, వైకల్య శాతం, ఇతర వివరాలను పొందుపరుస్తారు. ఈ ఐడీని స్కాన్ చేస్తే పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. ఇప్పటి వరకు సదరం సర్టిఫికెట్లు రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఐడీ కార్డులు మాత్రం దేశ వ్యాప్తంగా చెల్లుబాటు అవుతాయి.

● 18 రకాల వైకల్యాల చేర్పు

ప్రస్తుతం యూడీఐడీ పోర్టల్‌లో 18 రకాల వైకల్యాలను చేర్చారు. వాటిలో న్యూరో సంబంధిత బాధితులు, తలసీమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యాధి నిర్ధారణ పూర్తయిన తరువాత కార్డు నెలలోపే నేరుగా తపాలా కార్యాలయం ద్వారా ఇంటికి పంపుతున్నారు. చిరునామా సరిగ్గా లేకపోవడం, లబ్ధిదారుడు అందుబాటులో లేకపోతే ఈ కార్డులు కొన్ని చోట్ల స్థానిక పీహెచ్‌సీలు లేదా తపాలా కార్యాలయాల వద్ద ఉంచనున్నారు. ఐడీ నెంబరు చెబితే కార్డును తీసుకొనేటట్లు వెబ్‌సైట్‌ను తీర్చిదిద్దనున్నారు.



మంచు దుప్పటిలో ఆలయం

జొన్నవాడలో శుక్రవారం వేకువజామున కురిసిన మంచుతో మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయం ముసురును తలపించింది. దేవస్థానం పరిసరాలను మంచు దుప్పటి కప్పేయడంతో సమీపంలో ఉన్న మనుషులు కూడా కనిపించలేదు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)

ఎల్‌టీ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వైద్యం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రేడ్-2 కింద ఏడు ఖాళీగా ఉన్నాయని, కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు వచ్చే నెల 4లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నీట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

● మే 4న పరీక్ష : కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్య కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే నీట్ మే 4వ తేదీ జరుగుతుందని, దీనికి పగ డ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నీట్ నిర్వహణపై సమన్వయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 4వేల మందికిపైగా విద్యార్థులు నీట్‌కు హాజరవుతారని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలను మాత్రమే పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేయాలని సూచించారు. ఆయా కేంద్రాలు నెల్లూరు నగరానికి దగ్గరగా ఉండేలా చూడాలని, రవాణా, భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల్లో పరీక్ష కేంద్రాలను ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్‌రావు, డీఈవో బాలాజీరావు, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శంకరయ్య, సీనియర్ అధ్యాపకులు, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గోదాముల వద్ద నిరంతర నిఘా ఉండాలి

నెల్లూరు (వెంకటేశ్వరపురం,ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల గోదాముల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర నిఘా ఉంచాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోదాములను ఆయన శుక్రవారం పరిశీలించారు. గోదాముల పరిసరాల్లో సైతం భద్రతాపరంగా అన్నీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో అనూష, తహసీల్దారు షఫీమాలిక్, నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

● కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నాయకుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నెల్లూరు (వైద్యం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు షేక్ అల్లాఉద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐతో కలిసి నిరసన తెలిపారు. అల్లాఉద్దీన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల ఆస్తులను దోచుకునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్న భావన కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జియా ఉల్ హక్, ముస్లిం లీగ్ జిల్లా అధ్యక్షుడు షఫీ, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్, ఈసీఐ నేత సిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రెహమాన్, సంజయ్‌కుమార్, సుధీర్, మల్లికార్జు న రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు బ్యాంక్ ఖాతాల్లో పింఛను

● డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ విద్యార్థులకు బ్యాంక్ ఖాతాల్లో పింఛను వేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి చెప్పారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో దివ్యాంగ విద్యార్థులు మూడు నెలలకు ఒకసారి పింఛను తీసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఏ నెలకానెల పెన్షన్ పొందే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. బ్యాంకు ఖాతా ద్వారా పింఛను పొందడానికి విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలు స్థానిక సచివాలయంలో సమర్పించాలన్నారు. ఆ తర్వాత విచారణ జరిపి అర్హుల ఖాతాల్లో పింఛను నగదు జమ చేస్తారని చెప్పారు.

● అవినీతి లేకుండా పెన్షన్ల పంపిణీ

ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి చర్యలు చేపట్టామని నాగరాజకుమారి తెలిపారు. శనివారం సాయంత్రానికి పెన్షన్ మొత్తాన్ని సచివాలయ అడ్మిన్లు డ్రా చేస్తారని, ఏప్రిల్ 1న పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో 306517 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని, 6400 మంది ప్రభుత్వ సిబ్బంది పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ఒకటిన టెన్త్ సోషల్ పరీక్ష

నెల్లూరు(విద్య), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఏప్రిల్ 1వతేదీ సాంఘిక శాస్త్రం (సోషల్ స్టడీస్) పరీక్ష జరుగుతుందని డీఈవో డాక్టర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31న జరగాల్సిన పరీక్షను రంజాన్ పండుగ సందర్భంగా మంగళవారానికి వాయిదా వేశారన్నారు. ఈ మార్పును విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు. కాగా, శుక్రవారం టెన్త్ విద్యార్థులకు జీవశాస్త్రం పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 29,100 మంది విద్యార్థులకుగాను 28,780 మంది హాజరుకాగా 320 మంది గైర్హాజరైనట్లు డీఈవో పేర్కొన్నారు. 51 కేంద్రాలను అధికారులు పరిశీలించారని తెలిపారు. అలాగే, ఓపెన్ స్కూల్ టెన్త్ అభ్యాసకులకు సోషల్ పరీక్ష జరిగిందని, 1506 మందికి 1298 మంది హాజరుకాగా 208 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

తమిళనాడుకి చేరిన కండలేరు నీరు


ఆంధ్రా- చెన్నై సరిహద్దులోకి ప్రవేశించిన నీటిలో పూలు చల్లుతున్న నీటి అధికారులు

రాపూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కండలేరు నుంచి 500 క్యూసెక్కుల నీటిని తెలుగు గంగ ప్రాజెక్ట్ అధికారులు సోమవారం తమిళనాడుకు విడుదల చేశారు. కాగా శుక్రవారం ఉదయం సుమారు 50 క్యూసెక్కుల నీరు తమిళనాడు బోర్డర్‌లోకి ప్రవేశించాయి. దీంతో అక్కడి అధికారులు ఆ నీటిలోకి పూలు చల్లి హర్షం వ్యక్తం చేశారు.

రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్‌పై నేడు శిక్షణ

నెల్లూరు (హరనాథపురం) మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ విధానంపై శనివారం శిక్షణ కార్యక్రమం జరుగుతుందని దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు నెల్లూరులోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే శిక్షణకు దస్తావేజు లేఖరులందరూ హాజరుకావాలని కోరారు.

ఉగాది వేడుకలకు ఏర్పాట్లు చేయండి

● డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జే ఉదయభాస్కర్‌రావు సంబంధిత అధికారులకు సూచించారు. ఉగాది వేడుకల నిర్వహణకు సంబంధించి శుక్రవారం ఆయన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో తిక్కన ప్రాంగణంలో ఉగాది వేడుకలు జరుగుతాయని చెప్పారు. పంచాంగ శ్రవణం, వేద పఠనం, కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వ హించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అధికారులందరూ తెలుగు సంప్రదాయ దుస్తులతో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సాంస్కృతిక మండలి కన్వీనర్, డీడీ ఐపీఆర్ కే సదారావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, హార్టీకల్చర్ ఏడీ సుబ్బారెడ్డి, డీపీవో సత్యవాణి, దేవదాయ శాఖ ఏసీ జనార్దన్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీవో వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫాప్టో జిల్లా చైర్మన్‌గా కంచర్ల మధుసూదనరావు


కంచర్ల మధుసూదనరావు

కావలిటౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫాప్టో) జిల్లా చైర్మన్‌గా కంచర్ల మధుసూదన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న మధుసూదన్‌రావు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని గుర్తించిన ఫాప్టో రాష్ట్ర నాయకత్వం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మధుసూదనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలతో పాటు విద్యావిధానాలు, విద్యాశాఖ సమస్యలు తదితర బృహత్తర బాధ్యతలు నిర్వర్తించే భాగ్యాన్ని కల్పించిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. విద్యాశాఖ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు రాష్ట్ర నాయకత్వం సలహాలు సూచనలతో అధికారుల సంప్రదింపులతో కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ రిటైర్‌మెంట్ ఉద్యోగులకు 6200 కోట్లు బకాయిలు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎస్, జీపీఎస్‌లు రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు.

ఏప్రిల్ 7 నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలు నిలిపేస్తాం..

● నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించండి ● అధికారులకు ఆశాల వినతి

నెల్లూరు (వైద్యం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం రూ. 3500 కోట్ల బకాయిలు ఇవ్వాల్సి ఉందని, వాటిని వెంటనే చెల్లించాలని లేకుంటే ఏప్రిల్ 7వతేదీ నుంచి వైద్యసేవలు నిలిపేస్తామని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్(ఆశా) నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం నెల్లూరులో కలెక్టరేట్ ఏవో విజయకుమార్‌కు, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్‌కు వినతిప త్రాలు అందించారు. అనంతరం ఆశా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీఎల్ నారాయణరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం భారీగా బకాయిలు ఇవ్వాల్సి ఉందన్నారు. దీంతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఏప్రిల్ 7 నుంచి నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో రోగులకు వైద్య చికిత్సలు నిలిపివేస్తామని చెప్పారు. అన్నీ రకాల వైద్య సేవలు కూడా ఆపేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు డాక్టర్ మురళీశంకరరెడ్డి, డాక్టర్ హజరత్‌కుమార్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో ఏవోకి వినతిపత్రం అందచేస్తున్న ఆశాలు

స్వర్ణాంధ్ర అమలుకు కమిటీలు వేయండి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర - 2047 విజన్ యాక్షన్ ప్లాన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆనంద్ జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి నరసింహారావుకు సూచించారు. ఈ అంశంపై శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో నెల్లూరు నగర కమిషనర్ సూర్యతేజతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానిక శాసన సభ్యులు చైర్‌పర్సన్‌గా, ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్మన్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు సభ్యులుగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా కమిటీలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఈ కమిటీలను త్వరగా నియమించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు, డీపీవో శ్రీధర్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ అధికారిని ప్రశ్నిస్తున్న మల్లమ్మ గుంట గ్రామస్థులు

విద్యుత్ కోతలపై గ్రామస్థుల నిరసన

రాపూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతలపై మండలంలోని మల్లమ్మగుంట గ్రామస్థులు శుక్రవారం రాపూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 400 గృహాలు ఉన్న గ్రామంలో గత కొద్దిరోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో విసుగు చెందిన గ్రామస్థులు విద్యుత్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. రాత్రి నుంచి ఉదయం వరకు విద్యుత్ లేకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. విద్యుత్ సమస్యలపై ఎస్ఈ, జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందచేస్తామని తెలిపారు.

వీఎస్‌యూలో ప్రాంగణ ఎంపికలు


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎంబీఏ విభాగాధిపతి సాయి స్రవంతి, కంపెనీ ప్రతినిధులు మహదేవ్, గౌతమ్

వెంకటాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాకుటూరు సమీపంలోని వీఎస్‌యూలో శుక్రవారం వర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ ఐటీ సంస్థ ఒరిసెంక్ టెక్నాలజీస్ సభ్యులు విద్యార్థుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. సెలెక్షన్‌లో ఎంబీఏ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రౌండ్లలో అర్హత సాధించిన విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిదులు కేవీ.మహదేవ్, గౌతం, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్, ఎంబీఏ విభాగాధిపతి సాయి శ్రవంతి, అధ్యాపకులు డాక్టర్ ఎల్ అరుణ, చెంచురెడ్డి ఉన్నారు.

'అక్షయపాత్ర'కు ఎలక్ట్రికల్ వాహనాల విరాళం


జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న వాఫ్ బక్రీ ఫౌండేషన్ ప్రతినిధులు

వెంకటాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డులోని పరిశ్రమల కేంద్రంలో ఉన్న అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు శుక్రవారం వాఫ్ బక్రీ టీ గ్రూప్ సంస్థ సభ్యులు నాలుగు ఎలక్ట్రికల్ వాహనాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సామాజిక విభాగం అధిపతి అజయ్ సిసిలియా, దక్షణ విభాగం అధిపతి పీవీ సురేష్, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధి ప్రేమ్ భక్తిదాసలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వాహనాలతో జిల్లాలోని 80ప్రభుత్వ పాఠశాలల్లోని 8వేల మంది పిల్లలకు మధ్యాహ్నభోజనాన్ని సరఫరా చేస్తామని అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధి ప్రేమ్ భక్తిదాస తెలిపారు.

50 శాతానికిపైగా వరి కోతలు పూర్తి

తోటపల్లిగూడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో వరి పైరు పంటకోత ప్రయోగాల నిర్వహణపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో వరి పైరుపై పంట కోత ప్రయోగాలు 68 శాతం చేయాల్సి ఉంది కానీ ఇప్పటివరకు కేవలం 45శాతం నిర్వహించినట్లు వ్యవసాయ అధికారిణి శిరీష, గణాంకాధికారి పీఈఎస్‌టీ రాంప్రసాద్ తెలిపారు. వరి పైరు కోతలు సుమారు 50 శాతానికి పైగా పూర్తయ్యాయని, మండలంలో సాధారణ దిగుబడులు నమోదువుతున్నట్లు పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8568
వెండి కిలో ధర	రూ. 103,600
వెండి ఒక గ్రాము	రూ.106.60

న్యూస్ బాక్స్

పంచాయతీ కార్యదర్శికి విధుల కేటాయింపు

తోటపల్లిగూడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నరుకూరు పంచాయతీ కార్య దర్శి ప్రవళికపై విధులకు సక్రమంగా రాని కార్యదర్శి కథనం మంగళ వారం ప్రచురితమైంది. ఈ వార్తకుడి ప్యాటీ సీఈవో మోహన్‌రావు శుక్రవారం స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ప్రవళి కకు మూడు రోజులు వరిగొండ, మూడురోజులు నరు కూరు సచివాలయాల్లో విధులు నిర్వహించాలనిఆదేశాలు జారీ చేసినట్లు మండలాధి కారి వెంక టేశ్వర్లు తెలిపారు.

ఎస్ఈఐఎల్‌కు సీఐఐ గోల్డ్ అవార్డు



అవార్డును అందుకుంటున్న సునీల్‌కుమార్ గుప్తా

ముత్తుకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు ప్రతిష్ఠాత్మక కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ పారిశ్రామిక భద్రతా నాయకత్వ గోల్డ్ అవార్డు అందుకున్నట్లు శుక్రవారం సంస్థ సీఈఓ రాఘవ్ త్రివేది అన్నారు. ఈ విషయంపై పైనాంపురంలోని ప్లాంట్‌లో మాట్లాడారు. పారిశ్రామిక భద్రతలో ఎస్ ఈఐఎల్ కనబరిభర్చిన నిబద్ధతను గుర్తిస్తూ విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డు వేడుకలో విద్యుత్, శక్తి విభాగంలో ఈ అవా ర్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. కంపెనీ తరపున ఓఅండ్ఎం హెడ్ సునీల్‌కు మార్‌గుప్తా, సేఫ్టీ హెడ్ జ్ఞానదేసిగన్ ఈ అవార్డును అందుకున్నట్లు చెప్పారు.

గంగమ్మ ఆలయం ముస్తాబు



ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న ఉత్సవాల నిర్వాహకులు

మనుబోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా ఉగాది పర్వదినం రోజున జరుగనున్న గంగమ్మ గ్రామోత్సవానికి నిర్వాహకులు ఆలయంను రంగులతో తీర్చిదిద్ది విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. వేడుకల్లో మనుబోలు యాదవ సంఘం సభ్యులు గంగమ్మకు పొంగళ్లు, అభిషేకాలు, భారీ అన్నసంతర్పణ, వీరతాళ్లు, గంగపెట్టె ఊరేగింపు చేపడతారు.

నేడు ఎమ్మెల్యే రాక

మనుబోలు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపేట గ్రామానికి శనివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రానున్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అక్కంపేటలో పార్టీ జెండా ఆవిష్కరణ చేయనున్నారు. అనంతరం రంజాన పర్వదినంను పురస్కరించుకుని అక్కంపేట ముస్లిం మైనార్టీ టీడీపీ రాష్ట్ర నాయకులు అమీర్‌భాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతులమీదుగా మహిళకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

వెంకటాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహిళా భద్రత చైతన్యంపై మండలంలోని వీఎస్‌యూలో శుక్రవారం వర్సిటీ ఉమెన్స్ సెల్, పోలీస్‌శాఖ సంయుక్తంగా శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ ప్రారంభించిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ ద్వారా ఒక్క క్లిక్‌తో పోలీసులకు సమాచారం అందించి సురక్షితంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, అధ్యాపకులు డాక్టర్ హనుమారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బీ.శ్రీనివాసరెడ్డి, శక్తి టీమ్ ఏఎస్ఐ సుబ్బారాజు, హెడ్ కానిస్టేబుల్ శామ్యూల్, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రంగయ్య, సుప్రియ తదితరులు ఉన్నారు.

జనసేనలో పలువురి చేరిక

అనంతసాగరం మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాల యంలో శుక్రవారం జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నియోజకర్గ సమన్వకర్త నలిశెట్టి శ్రీధర్, ఇతర నియోజక వర్గాల ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు. ఆయన సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించగా జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ భరత్, రవి, ముత్తం కృష్ణ పాల్గొన్నారు.

షుగర్ బాధలు తీరినట్లే!

- త్వరలోనే కార్మికులకు బకాయిల చెల్లింపు
- కర్మాగారం భూముల్లో పరిశ్రమలు
- యువతకు ఉపాధి అవకాశాలు
- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవతో సీఎం ఆదేశం



కోవూరు చక్కెర కర్మాగారం ముఖద్వారం

కోవూరు, మార్చి28(ఆంధ్రజ్యోతి):కోవూరు సహకార చక్కెర కర్మాగారం కార్మికుల కష్టాలకు త్వరలోనే తెరపడనుంది. ఎప్పటి నుంచో బకాయిల కోసం ఎదురుచూస్తున్న కార్మికులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో వారిలో ఆనందం వెల్లివిరుస్తున్నది. కోవూరు- బుచ్చి రోడ్డుమార్గంలో 1979లో ఏర్పాటైన ఈ చక్కెర కర్మాగారం పన్నెండేళ్ల గా కునారిల్లుతోంది. చెరుకు గానుగ ఆడక పోవడంతో కర్మాగారంలోని సామగ్రి తుప్పుపట్టింది. విలువైన యంత్ర సామగ్రిని రాష్ట్రంలోని పలు చక్కెర కర్మాగారాలకు తరలించారు. పెద్ద సంఖ్యలో ఉన్న కార్మికులు తలోదిక్కుకు వెళ్లిపోయారు. రెగ్యులర్ కార్మికులు చాలామంది మృతి చెందారు. పదవీ విరమణ చేసిన కార్మికులు బకాయిల కోసం ఎదురు చూస్తూ మంచం పట్టారు. ప్రారంభంలో రెండువేల మంది కార్మికులు పనిచేసేవారు. రిటైర్ అయిన వారు, మధ్యలో మానుకున్న వారు పోగా కర్మాగారం మూడపడే సమయానికి దాదాపు 446మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి సుమారుగా రూ.26 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

● హామీ నెరవేర్చిన ప్రశాంతిరెడ్డి

చక్కెర కర్మాగారం దుస్థితిని గుర్తించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తాను గెలిస్తే కార్మికుల విషయమై పోరాడతానని గత ఎన్నికల సమయంలో హామీ యిచ్చారు. బుచ్చి ఎన్నికల సభలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు దృష్టికి చక్కెర కర్మాగారం దుస్థితిని తీసుకెళ్లారు. ఎమ్మెల్యేగా ఆమె గెలిచాక చక్కెరశాఖ ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చించారు. ఇటీవల అసెంబ్లీలో కూడా గళం విప్పారు. 124 ఎకరాల చక్కెర కర్మాగారం భూమిలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశముందని వివరించారు. ప్రశాంతిరెడ్డి విజ్ఞప్తిని ఆలకించిన సీఎం చంద్రబాబు మంగళ, బుధవారాల్లో జరిగిన కలెక్టర్ల సమావేశంలో కార్మికులకు వరాలు ప్రకటించారు. చక్కెర కర్మాగారం భూమిని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐఐసీ)కు కేటాయించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.26 కోట్లు చెల్లించేందుకు చర్య తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఎన్నికల హామీని ఎమ్మెల్యే నెరవేర్చుకున్నట్లు అయింది.

● ఆలోచన అద్వితీయం

చక్కెర కర్మాగార చెందిన భూముల్లో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుచేయాలనే ఆలోచనే అద్వితీయంగా ఉందని కోవూరు, నెల్లూరు నగర నియోజకవర్గాల ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రెండు నియోజకవర్గాల యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగానే ఉపాధి దొరుకుతుందని, దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అగత్యం తప్పుతుందంటున్నారు. అంతేకాక కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం పరిసరప్రాంతాల్లోపలువురు ఉపాధి పొందే వీలుంది. రవాణారంగంలోని డ్రైవర్లు, మెకానిక్‌లు, వ్యాపారులు, కార్మికులకు మెరుగైన ఉపాధి దొరికే అవకాశం ఉంది.

తొమ్మిది నెలల్లోనే పరిష్కారం



ఎన్నికల వాగ్దానం మేరకు చక్కెర కర్మాగారంకు పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేశాం. పదేళ్ల సమస్యను తొమ్మిది నెలల్లోనే పరిష్కరించాం. బకాయిల చెల్లింపునకు ఆదేశించిన సీఎంకు కృతజ్ఞతలు.

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్యే, కోవూరు

దళితులకు రుణాలు ఇవ్వకపోవడం అన్యాయం

- దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దళిత సంఘర్షణ సమితి నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):దళితులు, గిరిజనులకు ఎస్సీ, ఎస్టీ రుణాలివ్వక పోవడం అన్యాయం అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దారుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల బీసీ కులాల వారికి రుణాలు మంజూరు చేసి ఇంటర్వ్యూలు పూర్తి చేసిందన్నారు. దళితులకు, గిరిజనులకు రాజ్యాంగబద్ధంగా ప్రతి ఏడాదికి మంజూరయ్యే ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వడం లేదన్నారు. ఏడేళ్లుగా రుణాలు అందక ప్రైవేటు బ్యాంకులు, వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలతో తీసుకుంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో తిరుపతయ్య, పెంచలయ్య, రమణయ్య, వెంకస్వామి, నరసయ్య, మస్తానయ్య, ఏసుదాసు, మున్నారమణయ్య, యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి

- తహసీల్దారును కలిసిన పంటపాలెం నీటి సంఘం అధ్యక్షుడు మురళీరెడ్డి

ముత్తుకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఈపూరులో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని పంటపాలెం సాగునీటి సంఘం అధ్యక్షుడు మునుకూరు మురళీధర్‌రెడ్డి కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు స్వప్నను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. 603 సర్వే నెంబర్లలో భూ సమస్య అపరిష్కృతంగా ఉందన్నారు. ల్యాండ్ సీలింగ్ భూముల లబ్ధిదారుల సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారంరెడ్డి విక్రంరెడ్డి, పేర్నేటి రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు సమస్యను వివరిస్తున్న పంటపాలెం నీటి సంఘం అధ్యక్షుడు మురళీరెడ్డి

తెలుగు అధ్యయన కేంద్రం స్వయం ప్రతిపత్తికి కృషి

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
- చవటపాలెంలో మాడభూషి కవిత్వ సుశీలన గ్రంథం ఆవిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, సంచాలకులు సంపత్‌కుమార్, తిరుమల స్వాతి

వెంకటాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు తమవంతు కృషి చేస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చవటపాళెం పంచాయతీలోని సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఉగాది పర్వదినం సందర్భంగా శుక్రవారం ద్విశతాధిక జాతీయ కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సోమిరెడ్డి పాల్గొని డాక్టర్ తిరుమల స్వాతి రచించిన మాడభూషి కవిత్వానుశీలన గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం కవులకు ఆత్మీయ సత్కారం చేసి మాట్లాడారు. 200 మందికిపైగా కవులు నియోజకవర్గ కేంద్రంలో జాతీయ సమ్మేళనం నిర్వహించడం సంతోషకరం అన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సర్వేపల్లిలో ఉండడం పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చొరవే అన్నారు. ప్రస్తుతం మైసూరులోని కన్నడ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి స్వయంప్రతిపత్తి కావాలని సంస్థ సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ తనను కోరినట్లు తెలిపారు. ఈ కేంద్రానికి జాతీయ రహదారి పక్కనే 5 ఎకరాల భూమి కేటాయింపు జరిగిందని, భవన నిర్మాణానికి రూ.50 కోట్ల నిధులు అవసరమని ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని, ఆనిధులను సాధించుకునేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం, మార్చి28 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్లు శివకుమార్‌రెడ్డి, నస్రీన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు పన్నుల బకాయిలు, అభివృద్ధి పనులు, నీటి సమస్య, నాన్ ఆప్కాస్ నుంచి తొలగించిన ఉద్యోగుల గురించి సమావేశంలో కమిషనర్‌ను ప్రశ్నించారు. ఈ విషయంలో కొంతసేపు సభ రసాభాసగా సాగింది. అలాగే ఆగిన నగర పంచాయతీ భవన నిర్మాణంలో జరిగిన అవకతవకలపై మాట్లాడారు. అనంతరం కమిషనర్, ఆర్ఐ ఇళ్ల, స్కూళ్ల నుంచి పన్నుల వసూళ్ల వివరాలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహకారంతో త్వరలోనే భవనం నిర్మాణం పూర్తిచేయడంతో పాటు ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, కమిషనర్ వివరించడంతో సమస్య సద్దుమణిగింది. సమావేశంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులందరూ ఆమోదించారు.

'గండికోట'కు చెన్నై తెలుగుశాఖ సత్కారం



గండికోటను సత్కరిస్తున్న నిర్వాహకులు, కవులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి):తెలుగు సాహిత్యాన్ని నిరంతరం విద్యార్థులకు తెలియజేస్తూ మాతృభాషను పెంపొందించేందుకు కృషి చేస్తున్న రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌ను శుక్రవారం మద్రాస్ యూనివర్సిటీలో తెలుగుశాఖ ఘనంగా సత్కరించింది. చెన్నైలోని మద్రాసు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకలో ఆ శాఖ అధ్యక్షులు శంకర్‌రావు, మధురై కామరాజు, యూనవర్సిటీ అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకటరమణ, తమిళనాడు సాంస్కృతికశాఖ అధ్యక్షులు తమ్మినేని బాబు, ప్రముఖ కవి, విమర్శకులు కాసుల నాగభూషణం, ప్రముఖ సినీగేయ రచయిత భువనచంద్రలు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

ఇమామ్‌లకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ



విందులో పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమారుడు అర్జున్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దమసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమారుడు అర్జున్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి ఉపవాసదీక్ష విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మసీదు ఇమాం, మౌజన్లకు రంజాన్‌తోఫా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం మత గురువులు అర్జున్‌రెడ్డిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ నాయకులు షబ్బీర్, మహబూబ్ బాష, సందాని, కౌన్సిలర్ రహమత్, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కమలాకర్‌రెడ్డి, బత్తల హరికృష్ణ పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం : నౌరాజ్

పొదలకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోకుండా, డ్రగ్స్ వినియోగిస్తున్నా, విక్రయించినట్లు తెలిసినా పోలీసులకు సమాచారం అందించాలని, అప్పుడే డ్రగ్స్‌రహిత సమాజం సాధ్యం అవుతుందని ట్రీస్ స్వచ్ఛందసేవా సంస్థ గౌరవాధ్యక్షుడు నౌరాజ్ అన్నారు. శుక్రవారం విరువూరు హరిజనవాడలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా స్థానిక పొదుపు మహిళలు, స్థానికులకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ సౌజన్యంతో ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నౌరాజ్ మాట్లాడారు. డ్రగ్స్‌కు అలవాటుపడితే చాలా కష్టం అన్నారు. యువత మత్తు మాదకద్రవ్యాల జోలికి వెళకుండా దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విరువూరు మహిళా సంరక్షక కార్యదర్శి సీహెచ్.వి.రూప, రీసోర్స్‌పర్సన్ ఎ.చంద్రశేఖర్, వీఓఏ జయంతి, మహేష్ గ్రామస్థులు, తదిత రులు పాల్గొన్నారు.



డ్రగ్స్ నిర్మూలన కరపత్రాలు చూపుతున్న మహిళలు

CRIME NEWS

అప్పుల బాధతో బేల్దారి మేస్త్రీ ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ బేల్దారి మేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరులోని దర్గామిట్టలోని పోలీసు కాలనీలో డీ అనిల్‌కుమార్(39), మానస దంపతులు నివసిస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనిల్‌కుమార్ బేల్దారి పనులు చేసు కుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పులు చేయడంతో ఆ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇటీవల అప్పుల బాధలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు అనిల్‌కుమార్ ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి జీజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అనిల్ తల్లి నారాయణమ్మ శుక్రవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వృద్ధురాలు...

నెల్లూరులోని కరెంటాఫీసు గేటు సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వృద్ధురాలు రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... 70 నుంచి 75 ఏళ్లలోపు వృద్ధురాలు మరణించింది. మెడలో ఎర్రని దారం ఉంది. మృతదేహానికి సమీపంలో ఎర్రటి దుప్పటి పడి ఉంది. నెల్లూరు రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ములుముడి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ములుముడి గ్రామం (నరసింహకొండవైపు) పంట పొలాల వద్ద ఓ వ్యక్తి మృతదేహాన్ని రూరల్ పోలీసులు శుక్రవారం గుర్తించారు. 40 ఏళ్ల వయసున్న వ్యక్తి పంట కాలువలో నీటికోసం దిగి అందులోపడి ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. గురువారం ఈ ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గుంజి వేణు వెల్లడించారు.

చికిత్స పొందుతూ మరొకరు...

వెంకటాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విషపూరిత మందు ప్రభావంతో స్పృహ కోల్పోయిన మండలంలోని కాకుటూరు గ్రామానికి చెందిన పాశం శీనయ్య (42) రెండురోజుల కిందట నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మరణించాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు.

సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌గా గాలి రామకృష్ణారెడ్డి

- మూడో జాబితాలో జిల్లా నుంచి ఒక్కరే ఎంపిక



మనుబోలు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం మూడో విడత నామినేటెడ్ పోస్టుల జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలో సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌గా మనుబోలు మండల టీడీపీ అధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డిని ఎంపిక చేశారు. మొదట విడతగా గత ఏడాది సెప్టెంబరులోనూ, రెండోవిడతగా నవంబరులోనూ కొన్ని కార్పొరేషన్లను, ఇతర పదవులను పార్టీనేతలకు, కార్యకర్తలకు కట్టబెట్టారు. తాజాగా మూడో జాబితాను ప్రకటించారు. మొదటి విడతలో జిల్లాలోని టీడీపీ నేతలు ఆనం వెంకటరమణారెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి,కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిలకు టీడీపీ తరపున, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి బీజేపీ తరపున, వేములపాటి అజయ్‌కుమార్‌కు జనసేన తరపున పదవులు దక్కాయి. రెండువిడతలో అబ్దుల్ అజీజ్‌కు పదవి వరించింది. మూడో విడతలో రామకృష్ణారెడ్డి ఒక్కరికే పదవి దక్కడం విశేషం. టీడీపీ శుక్రవారం విడుదల చేసిన మూడో విడత నామినేటెడ్ పోస్టుల జాబితాలో సర్వేపల్లి నియోజకవర్గానికి మాత్రమే చోటు దక్కింది. సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌గా మనుబోలు మండల టీడీపీ అధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డిని నియమిస్తున్నట్లు టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది. మనుబోలు మండలం పిడూరుపాళెం గ్రామానికి చెందిన ఆయన ఎన్నో ఏళ్లుగా టీడీపీలో కొనసాగుతున్నారు. గత ఆరేళ్లుగా మండలాధ్యక్షుడిగా కొనసాగుతూ, గత ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం బాగా శ్రమించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొద్ది నెలల క్రితం ఏఎంసీ చైర్మన్‌గా గాలిని ప్రతిపాదిస్తూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధిష్ఠానానికి ప్రతిపాదనలు పంపారు. తనకు పదవివచ్చేలా కృషిచేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి ఈ సందర్భంగా గాలి కృతజ్ఞతలు తెలిపారు. దీంతోపాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు రామకృష్ణారెడ్డికి అభినందనలు తెలిపారు.త్వరలో ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు.

కావలిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు కృషి

- బార్ అసోసియేషన్ వార్షికోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తులు



ఏపీ బార్ అసోసియేషన్ మెంబర్‌ను సత్కరించిన న్యాయవాదులు

కావలిరూరల్, మార్చి 28(ఆంధ్ర జ్యోతి): కావలిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు కొనకంటి శ్రీనివాసులురెడ్డి, కుంభజడల మన్మధరావు పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టుఆవరణలో శుక్రవారం రాత్రి కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బార్ అసోసియేషన్ వార్షికోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు పుస్తకాలు ఎంత బాగా చదివితే అంత ఎదుగుతారన్నారు. కేసులపై బాగా స్టడీ చేసి సంబంధిత డాక్యుమెంట్లు ప్రొడ్యూస్ చేస్తే మంచి ఆర్డర్లు వస్తాయన్నారు. కావలిలో స్నేహపూరిత వాతావరణం ఉంటుందని, అందువలన ఇక్కడ పనిచేసిన అధికారులు మరోచోటకు వెళ్లేందుకు ఇష్టపడరన్నారు. సూర్యుడి నుంచి శక్తి గ్రహించే పొద్దుతిరుగుడు పువ్వులు ఆకాశం మేఘావృతమైనప్పుడు ఒకదాని వైపు మరొకటి తిరిగి శక్తిని పొందుతాయని అలాగే న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచెయ్యటం ద్వారా న్యాయబద్ధమైన తీర్పులు వెలువడుతాయని పేర్కొన్నారు. న్యాయమూర్తి మన్మధరావు మాట్లాడుతూ నా విద్యార్థి జీవితం కావలితో ముడిపడి ఉందన్నారు. విశ్వోదయ బాలుర పాఠశాలలో 10వ తరగతి, జవహర్ భారతి కళాశాలలో ఇంటర్ చదివానన్నారు. ఇక్కడ పూర్వ విద్యార్థిగా తిరిగిన నేను తిరిగి హైకోర్టు న్యాయవాదిగా రావటం ఆనందంగా ఉందన్నారు. బార్‌లో 31 ఏళ్ల న్యాయవాదిగా కష్టపడి పనిచేశానని 3ఏళ్ల నుంచి న్యాయమూర్తిగా ఉంటున్నానన్నారు. 3ఏళ్లలో న్యాయమూర్తిగా 12వేల కేసులు ప రిష్కరించాన్నారు. కేసుల అప్పీలుకు 60కి.మీటర్ల దూరంలోని నె ల్లూరుకు వెళ్లాల్సి వస్తుందని, ఏడీజే కోర్టు కావలిలో ఏర్పాటు చెయ్యాలని స్థానిక బార్ అసోషియేషన్ నాయకులు కోరారు. అనంతరం నృత్యంతో అలరించిన చిన్నారి మేఘశ్రీని సన్మానించి అభినం దించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి సి.యామిని, అ దనపు న్యాయాధికారులు సుమ, గీత, షమ్మీ సర్వీన్ సుల్తానా, కెవి ఎస్. పవన్, పాండురంగారెడ్డి, సరస్వతి, ఏపీ బార్ అసోసియేషన్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, కావలి న్యాయాధికారి ఎం.శోభ, సుధాకర్‌రావు, సీనియర్ న్యాయవాదులు పోట్లూరి పాల్గొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 440



రాజరాజేశ్వరికి నేత్రపర్వంగా పల్లకీసేవ

● దర్శించుకున్న ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నేత్రపర్వంగా జరిగింది. అమ్మవారిని డీఆర్‌డీవో చైర్మన్ సతీష్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఉదయం రాహుకాల పూజలకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఉద్వాపన పూజలు కూడా జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

సింహపురి ఉగాది వేడుకలకు తరలిరండి



సమావేశంలో ఉగాది సమితి నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ట్రంకురోడ్డులో గల వరసిద్ధి వినాయక మందిరం వద్ద ఆదివారం జరిగే సింహపురి ఉగాది వేడుకలకు ప్రజలందరూ తరలిరావాలని సింహపురి ఉగాది సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం టీఏస్ కల్యాణ సదన్‌లో సమితి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఉగాది రోజు జరిగే కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో సమితి నాయకులు పీ సురేంద్రరెడ్డి, పిట్టు సత్యనారాయణ, వేలూరు మహేష్, గుడ్లదొన వాసుదేవరావు, కంచర్ల భాస్కర్‌రావు, ఆమంచర్ల ప్రభాకర్, బీఏస్ రంగన రాజన్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

రేపు భువనేశ్వరికి శాకంబరి అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీవిశ్వావసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా మూలస్థానేశ్వర ఆలయంలో ఆదివారం భువనేశ్వరి అమ్మవారికి శాకంబరి అలంకారం జరుగుతుందని ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పూలంగిసేవ, సాయంత్రం 6గంటలకు కోటా రాధాకృష్ణమూర్తి పంచాంగ శ్రవణం, 7 గంటలకు శివపార్వతుల కల్యాణం, 8 గంటలకు పుష్పయాగం, 9గంటలకు నగరోత్సవం జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

యోగా వెల్‌నెస్ సెంటర్లు ఎన్ని కేటాయించారు?

● లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆయుష్ మిషన్ కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్ని యోగా వెల్‌నెస్ కేంద్రాలు కేటాయించారో తెలియజేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం లోక్‌సభలో ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రతిపాదనల ప్రకారం 2024-25 మధ్య 45 యూనిట్ల యోగా వెల్‌నెస్ సెంటర్లు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 13 యోగా వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

తడికల బజారులో చలివేంద్రం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తడికల బజారు మీసేవా కేంద్రం వద్ద 8వ డివిజన్ జనసేన పార్టీ ఇన్‌చార్జి గుర్రం కిషోర్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, కృష్ణారెడ్డి హాజరయ్యారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నగరం మొత్తం చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ హుండీల ఆదాయం రూ.82లక్షలు

వలేటివారిపాలెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కల్యాణ మండపంలో శుక్రవారం హుండీల లెక్కింపు జరిగింది. 12 శనివారాల్లో భక్తులు సమర్పించిన కానుకల లెక్కించగా రూ.82,44,463 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు. కందుకూరు గ్రూప్-2 ఆలయం కార్యనిర్వాహణాధికారి రవీంద్రనాథ్ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. 178 గ్రాముల బంగారం, 1 కేజీ 5 గ్రాముల వెండి, 56 యూఎస్ డాలర్లు, 200 యూఏఈ దిర్హామ్‌లు, 700 ఒమాన్ బైసా, 8 ఒమాన్ రియల్, 20 ఇంగ్లండ్ పౌండ్స్, నేపాల్‌కు చెందిన రూ.50 లభించినట్లు డీసీ తెలిపారు.

దగదర్తి వైస్ ఎంపీపీ ఎన్నిక మళ్లీ వాయిదా

దగదర్తి(బిట్రగుంట), మార్చి 28(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం రిటర్నింగ్ అధికారి సుబ్బరాజు నిర్వహించిన మండల ఉపాధ్యక్ష ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎంపీపీ, ఎంపీటీసీలు ఎవరూ రాకపోవడంతో ఎన్నిక వాయిదా వేశారు. రెండవ సారి కూడా ఎన్నిక వాయిదా పడిన విషయాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారికి నివేదిస్తామని, తదుపరి ఆదేశాలు తెలియచేస్తామని అధికారులు పేర్కొన్నారు.

అసలే ఇరుకురోడ్డు.. ఆపై రాళ్ల గుట్టలు !

● కనకమహల్ నుంచి కొత్తహాలు వరకు ఇంతే..
● పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు



కనకమహల్ నుంచి కొత్తహాలు వైపు వెళ్లే మార్గంలో రోడ్డుకు పక్కగా కాంక్రీట్ వ్యర్థాలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కనకమహల్ సెంటర్ నుంచి కొత్తహాలు వరకు రోడ్డు ఇరుకుగా ఉంటుంది. వాహనాలు ప్రయాణం చేయటమే కాకుండా ప్రజలు నడిచేందుకు కూడా కష్టంగా ఉంటుంది. అలాంటి రహదారిపై ప్రస్తుతం రాళ్ల గుట్టలు వాహనదా రులు, పాదచారులకు నరకం చూపుతున్నాయి. ఇటీవల కాలంలో వైర్లు ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాంతాల్లో రోడ్డు పక్కన తవ్వి వైర్లు వేసి గుంటలను పూడ్చేశారు. అయితే తవ్విన గుంటలను పూర్తిగా పూడ్చకపోవ డం, మిగిలిన వ్యర్థాలను అక్కడే వదిలివేయడంతో ప్రజలకు ప్రయాణం కష్టంగా మారింది. రాళ్లను తట్టు కుంటూ పడుతూ లేస్తూ ప్రయాణాలు చేస్తున్నారు.



మల్టీప్లెక్స్, షాపింగ్ మాల్స్‌లో పార్కింగ్ ఉచితం

● కొనుగోలు బిల్లు చూపకపోతేనే రుసుము ● నగర కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), మార్చి28, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని మల్టీప్లెక్స్, షాపింగ్ మాల్స్‌లో వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి రుసుము వసూలు చేయరాదని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ప్రకటించారు. శుక్రవారం ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్‌లకు వాహనాలతో వెళ్లిన వారు 30 నిమిషాలలోపు తిరిగి వస్తే ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అంతకన్నా ఎక్కువ సేపు ఉండేవారు కొనుగోలు చేసిన బిల్లులు చూపితే సరిపోతుం దని, అవి లేకపోతేనే రుసుము చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. గంటకు మించి వాహనాలు పార్కింగ్ చేసిన వారు సినిమా టికెట్లు, కొనుగోలు బిల్లులు చూపితే పార్కింగ్ ఉచితమేనని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని, నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రోడ్డుపై అడ్డంగా ఉంచిన కంకరగుట్టను తొలగించాలని సూచిస్తున్న కమిషనర్ సూర్యతేజ

యూజీడీ అనుసంధానం ఉచితం

నగరంలో త్వరలో పూర్తి చేయనున్న భూగర్భ డ్రైనేజీకి ఇంటి కనెక్షన్ల అనుసంధాన ప్రక్రియను ఉచితం చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. 18వ డివిజన్‌లో రోడ్లపై, ఇళ్ల వద్ద ఉన్న వ్యర్థాలను, భవన నిర్మాణ వస్తువులను తొలగించాలని వాటి యజమానులను ఆదేశించారు. గతంలో యూజీడీ అనుసంధానం చేస్తే రూ.5 వేలు తీసుకునేవాళ్లమని చెప్పారు. కానీ ప్రస్తుతం దానిని ఉచితం చేసినట్లు వెల్లడించారు. మరో మూడు నెలల్లో ఈ ప్రక్రియ మొదలు కానున్నదని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావాల్సిందే!

● కార్పొరేషన్ ఇంజనీర్లతో రూరల్ ఎమ్మెల్యే సమీక్ష



కార్పొరేషన్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రూరల్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలో తలపెట్టిన అభివృద్ధి పనులు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుకున్న సమయానికి పూర్తి కావాల్సిందేనని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కార్పొరేషన్ ఇంజనీర్లతో సమీక్ష జరిపారు. నియోజకవర్గం లోని డివిజన్లలో 303 పనులు చేపట్టగా అందులో 62 పూర్తయ్యాయని, రెండు పనులు అసలు మొదలే కాలేదని చెప్పారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. తాను ఆకస్మిక తనిఖీల ద్వారా ఈ విషయం తెలుసుకున్నానని, మొదలుకాని పనులను 24 గంటల్లో ప్రారంభించాలని ఆదేశించారు. మే 20వ తేదీ నాటికి పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



వెట్టిచాకిరి విముక్తి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న కలెక్టర్ ఆనంద్

వెట్టిచాకిరిపై అవగాహన కల్పించాలి

● నెల్లూరు ఆర్డీవో అనూష

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున వెట్టిచాకిరిపై అందరికీ అవగాహన కల్పించాలని నెల్లూరు ఆర్డీవో అనూష అధికారులను ఆదేశించారు. కలెక్టరే ట్‌లోని తిక్కన ప్రాంగణంలో నెల్లూరు, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ల పరిధి లోని తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులకు వెట్టిచాకిరి చట్టంపై అవగాహన కోసం శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. సాంఘిక సంక్షేమశాఖ, ఇంటర్నేషనల్ జెస్టిస్ మిషన్ ప్రతినిధులు శ్యామ్, ప్రియాంక ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వకపోవడం, శారీరిక శ్రమను దోచుకోవడం, ఆర్థిక స్వేచ్ఛ ను హరించ డం, బందీలుగా పని చేయించడం వంటివి వెట్టిచాకిరి కిందకు వస్తాయన్నారు. వర్క్‌షాపు అనంతరం వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందిన వ్యక్తికి కలెక్టర్ ఆనంద్ ద్వారా రిలీజ్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

సీపీఎం మాలకొండారెడ్డికి నివాళి

నెల్లూరు (వైద్యం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీపీఎం బలోపేతానికి నాయకుడు మాలకొండారెడ్డి ఎంతో కృషి చేశారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. శుక్రవారం నగరంలోని శెట్టిగుంటరోడ్డు సెంటర్‌లో మాలకొండారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, సూర్యనారాయణ, నరసింహ, శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసన్ ఐకేర్ ఆసుపత్రి వారు కంటి వైద్య శిబిరం నిర్వహించారు.

యోగాతో ఆరోగ్య జీవనం

● భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు బాసిరెడ్డి

నెల్లూరు(విద్య), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక యుగంలో ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యకరమైన జీవనం సాగించాలంటే యోగాతోనే సాధ్యమవుతుందని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు బాసిరెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శుక్రవారం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగా సాధన కోసం ప్రతి ఒక్కరూ నిత్యం కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు వినుకొండ వెంకటేశ్వర్లు వాకర్స్ సంఘాల జిల్లా ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి జీ నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, గౌరవాధ్యక్షుడు తలపనేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని కస్తూరి దేవి గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన అధికారిక ఇఫ్తార్ విందులో మంత్రులు నారాయణ, ఆనం, అజీజ్, కోటంరెడ్డి, కలెక్టర్, సిటీ కమిషనర్ తదితరులు



సర్వేపల్లి ముస్లింలకు సోమిరెడ్డి ఇఫ్తార్ విందు



నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గంలోని ముస్లింలకు శుక్రవారం రాత్రి ఆ నియోజకవర్గ ఎమ్మె ల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా దువా చేశారు. వైసీపీ ప్రభుత్వం ఇమామ్‌లు, మౌజన్‌లకు బకాయి పెట్టిన జీతాలను పెంచి కూటమి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మసీదులు, శ్మశానాలు తదితర 52 అభివృద్ధి పనులకు రూ.3కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు ప్రతిపాదనలు పంపిందని, ఆ నిధులు సాధించి పనులు చేపడుతామని తెలిపారు.

'నారాయణ'లో రక్తదాన శిబిరం



శిబిరంలో అధ్యాపకులు, విద్యార్థులు

నెల్లూరు(విద్య), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బీ దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ నారాయణ మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, వీఆర్ విత్‌యూ చారిటబుల్ ట్రస్ట్‌తో కలిసి శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని 103 యూనిట్ల రక్తాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి, మెడిసన్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ఏ యశోవర్ధన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం చంద్రమోహన్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యం: ఏఎస్పీ సౌజన్య



ఆవిష్కరణ అనంతరం హెచ్చరిక బోర్డు వద్ద ఏఎస్పీ సౌజన్య, చిత్రంలో సిటీ డీఎస్పీ సింధుప్రియ, ట్రాఫిక్ పోలీసులు

నెల్లూరు(క్రైం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య అధికారులను ఆదేశించారు. నగరంలోని ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో శుక్రవారం రోడ్డు భద్రత హెచ్చరిక బోర్డులను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నియమా లు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపుతూ ఎక్కువ మంది తలకు గాయాలు కావడం వల్లే మరణిస్తున్నారని, దీనివల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్లలో వెళ్లడం, అనధికార పార్కింగ్ వంటివి సహించేది లేదని హెచ్చరించారు. ట్రాఫిక్ అంబాసిడర్ అనే వాట్స్ యాప్ గ్రూప్ ద్వారా ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రజలకు ట్రాఫిక్ పోలీసులు సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర డీఎస్పీ సింధుప్రియ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మసీదుల్లో రంజాన్ కానుకల పంపిణీ



రంజాన్ కిట్లు అందజేస్తున్న సుబ్బారావు

నెల్లూరు (వైద్యం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47వ డివిజన్‌లో ఉన్న మసీదుల్లో శుక్రవారం టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు రంజాన్ తోఫా కిట్లు అందచేశారు. మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ సూచనల మేరకు అన్ని మసీదుల్లో రంజాన్ కానుకలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ గణేష్‌కుమార్, భాస్కర్, ఫిరోజ్, మాబాషా, అద్దంకి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీదుర్గా ఆసుపత్రిలో...

నగరంలోని శ్రీ దుర్గా ఆసుపత్రిలో శుక్రవారం రంజాన్ వేడుకలు జరిగాయి. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర రంజాన్ సందర్భంగా చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగుల కళ్లలో ఆనందం

● నాడు లాగేసుకున్న వైసీపీ
● నేడు ఆదుకున్న కూటమి ప్రభుత్వం
● జీపీఎఫ్, పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐకు మోక్షం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు తాము దాచుకున్న సొమ్మును గత వైసీపీ ప్రభు త్వంలో పొందడానికి నానా అవస్థలు పడ్డారు. వారి సొమ్మును వారికి తెలియకుండా నాటి ప్రభుత్వం లాగేసుకుంది. ఏపీజీ ఎల్ఐ బాండ్ల కాలపరిమితి ముగిసినా ఆ చెల్లింపులు చేయలేదు. పిల్లల చదువులు, వివాహాలు, గృహాల నిర్మాణాలు, ఇతర అత్య వసరాలకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు రుణాలకు దరఖాస్తు పెట్టుకున్నా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టింది. ఈ క్రమంలో ఇక చెల్లింపులు జరగవని ఉద్యోగులు ఆశలు కూడా వదులుకున్నారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉద్యోగుల జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ చెల్లింపులు చేస్తామని మాట ఇవ్వడ మేకాదు నిధులు కూడా చెల్లించడంతో ఉద్యోగుల కళ్లలో ఆనం దం వెల్లివిరుస్తోంది.

● **రూ.400 కోట్లకు పైబడి..?**

జిల్లాలో జీపీఎఫ్ చెల్లింపులు రూ.400 కోట్లకు పైబడి చేసినట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఐదు వేల మందికి పైబడి ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ బాండ్ల తుది చెల్లింపులు వారి ఖాతాలకు జమయ్యాయి. సుమారు రూ.100 కోట్లకు పైబడి ఈ చెల్లింపులు జరిగినట్లు తెలుస్తోంది. జడ్పీ పరిధిలో సుమా రు మూడు వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణాలు విడుదలయ్యాయి. దీంతో వారిలో ఆనందం వ్యక్త మవుతోంది. వారు రెండేళ్ల క్రితం పీఎఫ్ రుణాల కోసం దర ఖాస్తు చేసుకున్నారు. అప్పటి వైసీపీ పాలనలో పీఎఫ్ రుణ దరఖాస్తులు ఆమోదం పొందక పోవడంతో చాలామంది తమ వాటా పీఎఫ్ చందాను తగ్గించేసుకున్నారు. అప్పట్లో ఉద్యోగ విరమణ చేసిన వారికి కూడా నాటి ప్రభుత్వం తుది చెల్లిం పులు చేయలేదు. అవన్నీ ఇప్పుడు విడుదలయ్యాయి. జిల్లా ట్రెజరీ అధికారులు కూడా వచ్చిన బిల్లులకు వెంటనే ఆమో దం తెలుపుతున్నారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం చర్యలతో ఉద్యోగ వర్గాల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.



ఆరోగ్యాధికారి కుమారికి సన్మానం



అరవ కుమారిని సన్మానిస్తున్న హంస జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, పరిమళ తదితరులు

నెల్లూరు (హరనాథపురం) మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ అధికారిగా అరవ కుమారి పేదలకు ఉత్తమ సేవలు అందించారని హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు. అరవ కుమారి ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఎన్జీవో హోంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం జరిగింది. సుధాకర్‌రావు మాట్లాడుతూ ఆమె 41 సంవత్సరాల విధి నిర్వహణలో రాష్ట్ర, జిల్లాస్థాయి అవార్డులు అందుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ అండ్ హెల్త్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేఈసీ విద్యాసాగర్, గౌరవ సలహాదారు డాక్టర్ మున్వర్, జిల్లా కార్యదర్శి కల్పం శ్రీనివాసులు, హంస గౌరవ సలహాదారులు పరిమళ, కార్తీక్, శశి, ప్రియదర్శిని, దివ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన స్మార్ట్ సిటీ

మాటల మాయల మరాఠీ జగన్ అటకెక్కించిన అభివృద్ధి పనుల్లో తిరుపతి స్మార్ట్ సిటీ ఒకటి. అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఈ పనుల ఊసు వైసీపీ ప్రభువులకు పట్టనే లేదు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా చెల్లించాల్సిన నిధుల్లోంచి పైసా విదిలించలేదు. తిరుపతి అభివృద్ధి అంటూ ఆర్భాటం చేసిన ఆయన అనుచర స్థానిక నేతలు కూడా ఎంతసేపటికీ టీటీడీ ఖజానాను బాదడానికే ప్రయత్నించారు. అప్పటి సీఎంను ఒప్పించి నిధులు తెప్పించడంలో విఫలమయ్యారు. ఫలితంగా మూడేళ్లలో పూర్తి కావాల్సిన స్మార్ట్ పనులు ఎనిమిదేళ్లయినా పూర్తి కాలేదు. ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో పెండింగ్‌లో ఉన్న స్మార్ట్ పనులను తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లారు. జిల్లా ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని సీఎంను ఒప్పించి నిధులు రప్పించడంపై శ్రద్ధ పెడుతారనే ఆశ ప్రజల్లో ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వినాయక సాగర్ పార్కులోపల అమెనిటీస్ భవనం ఇలా ఆగిపోయింది

ఐదేళ్లూ అటకెక్కించిన జగన్ ప్రభుత్వం

చంద్రబాబుపై పెరిగిన ఆశలు



అసంపూర్తిగా వున్న మల్టీ లెవల్ కార్ పార్కింగ్ నిర్మాణం

ఇవీ పెండింగులో వున్న స్మార్ట్ సిటీ పనులు

పని పేరు	అంచనా వ్యయం	జరిగిన శాతం	జరిగిన చెల్లింపులు
నిరంతర నీటి సరఫరా	రూ. 29.90 కోట్లు	90 %	రూ. 19.96 కోట్లు
వినాయకసాగర్ అమెనిటీస్ భవనానికి అదనపు అంతస్తు నిర్మాణం	రూ. 1.64 కోట్లు	85 %	రూ. 1.22 కోట్లు
గొల్లవానిగుంట చెరువు అభివృద్ధి	రూ. 1.21 కోట్లు	80 %	రూ. 0.71 కోట్లు
కమాండ్ కంట్రోల్ సెంటర్	రూ. రూ. 180 కోట్లు	15 %	రూ. 11 కోట్లు
వినాయక సాగర్ స్విమ్మింగ్ పూల్	రూ. 3.03 కోట్లు	55 %	రూ. 0.88 కోట్లు
వినాయకసాగర్ మార్కెట్ అభివృద్ధి	రూ.1.09 కోట్లు	75 %	రూ. 0.79 కోట్లు
వినాయకసాగర్లో జిమ్, ఫన్‌జోన్ అమెనిటీస్	రూ. 1.99 కోట్లు	70 %	రూ. 070 కోట్లు
వినాయకసాగర్లో ఆర్టిఫిషియల్ గ్లోయింగ్ యానిమల్స్	రూ. 1.25 కోట్లు	25 %	--
నెహ్రూ మున్సిపల్ స్కూల్లో ఇండోర్ స్టేడియం	రూ. 0.61 కోట్లు	65 %	రూ. 0.36 కోట్లు
తూకివాకంలో సావేజ్ ప్లాంట్	రూ.45.75 కోట్లు	65 %	రూ. 21.17 కోట్లు
మున్సిపల్ ఆఫీసు భవనం	రూ. 94.50 కోట్లు	60 %	రూ. 16.60 కోట్లు
ఏడంతస్తులతో మల్టీలెవల్ కార్ పార్కింగ్, మల్టీ ప్లెక్స్	రూ. 52.50 కోట్లు	20 %	రూ. 7.34 కోట్లు
వినాయకసాగర్ మార్కెట్	రూ. 2 కోట్లు	31 %	రూ. 0.52 కోట్లు
తూకివాకంలో 6 మెగావాట్స్ సోలార్ పవర్ ప్రాజెక్ట్	రూ. 21.80 కోట్లు	75 %	రూ. 14.30 కోట్లు
మొత్తం	రూ. 437.27 కోట్లు		రూ. 95.55 కోట్లు

■ ఏమిటీ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు?

కేంద్ర ప్రభుత్వం 2017-18లో స్మార్ట్ సిటీ మిషన్ పేరిట దేశవ్యాప్తంగా ప్రాముఖ్యత కలిగిన నగరాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఆ పథకం కింద రాష్ట్రం నుంచీ కాకినాడ, తిరుపతి ఎంపికయ్యాయి. తిరుపతి నగరాన్ని రూ. 1586 కోట్లతో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలని లక్ష్యం పెట్టుకుంది. ఈ ఖర్చులో కేంద్రం రూ. 500 కోట్లు, రాష్ట్రం రూ. 500 కోట్లు భరించాలి. మిగిలిన రూ. 586 కోట్లలో టీటీడీ రూ. 435.50 కోట్లు, ఎస్సీడీసీఎల్ రూ. 150.54 కోట్లు ఇవ్వాలి. ఈ మొత్తం నిధులతో నగర ప్రజలకు, యాత్రికులకు ఉపయోగపడే 97 పనులను తిరుపతి నగరంలో ప్రతిపాదించారు. ఆధునిక రవాణా, క్రీడలు, వినోద, విహార సదుపాయాలు అందుబాటులోకి తెచ్చే పనులవి. ఈ పనులన్నీ 2019-20కి పూర్తి కావాలి.

■ ఎనిమిదేళ్ళయినా పూర్తి కాని పనులు

తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పనులు పూర్తి కావడానికి పెట్టుకున్న మూడేళ్ల గడువు కాదు కదా అది దాటి ఐదేళ్ళవుతోంది. మొత్తంగా ప్రాజెక్టు ప్రారంభమై ఎనిమిదేళ్ళవుతున్నా ఇంకా కొన్ని పనులు పెండింగులోనే వున్నాయి. 97 పనులకు గానూ 83 పూర్తయ్యాయి. మిగిలిన 14 పనులు పెండింగులో వున్నాయి. ఇప్పటి వరకూ సుమారు రూ.1109 కోట్లు విడుదలయ్యాయి. పూర్తయిన 83 పనుల్లోనూ 10-12 పనులకు సుమారు రూ. వంద కోట్ల బిల్లులు పెండింగులో వున్నాయి. అలాగే పెండింగులో వున్న 14 పనులకు సంబంధించి జరిగినంత వరకూ రూ.60 కోట్ల దాకా బిల్లులు పెండింగు పడ్డాయి. మొత్తంగా పెండింగు బిల్లులకే రూ.160 కోట్లు బకాయి చెల్లించాల్సి వుంది.

■ నాలుగేళ్ళలో నయాపైసా విదిలించని వైసీపీ

2019-24 నడుమ ఐదేళ్ళ పాటు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం చివరి నాలుగేళ్లలో తన వాటా నిధుల నుంచీ నయాపైసా కూడా స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు విడుదల చేయలేదు. మూడు విడతలుగా రూ.304 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. దీంతో కేంద్రం కూడా మెలిక పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు పూర్తిగా విడుదలయ్యాకే తన వాటా నిధుల్లో పెండింగ్ వున్న రూ.98 కోట్లు విడుదల చేస్తామని స్పష్టం చేసింది. తిరుపతి ఎమ్మెల్యే, అప్పటి టీటీడీ ఛైర్మన్ కూడా అయిన భూమన కరుణాకర్‌రెడ్డి టీటీడీ నిధుల కోసం ప్రయత్నించారే తప్ప సీఎం జగన్‌ను ఒప్పించి నిధులు తెచ్చే పని చేయలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.304 కోట్లలో రూపాయి కూడా విడుదల చేయించలేకపోయారు.



వినాయకసాగర్ వద్ద అసంపూర్తిగా కూరగాయల మార్కెట్ భవన సముదాయం

■ ఆశలన్నీ ముఖ్యమంత్రి పైనే!

తిరుపతి నగరాన్ని కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీగా ఎంపిక చేయడంలో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారు. ఇందులో భాగంగానే తిరుపతిలో గరుడ వారధిని ఆయనే ప్రతిపాదించారు. నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేశారు. 2017-18, 2018-19లలో రెండేళ్ళ పాటు ఆయన హయాంలో నిధుల విడుదల కూడా సాఫీగా జరిగింది. తర్వాత ఐదేళ్ళ పాటు వైసీపీ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యంతో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు అటకెక్కింది. ఇపుడు మళ్ళీ చంద్రబాబు నాయుడు సీఎం కావడంతో నగర వాసులు ఆయనపైనే ఆశలు పెట్టుకుంటున్నారు. మంగళ, బుధవారాల్లో అమరావతిలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సు సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పెండింగ్ పనులను ప్రస్తావించి నిధులు విడుదల చేయాలని సీఎంను అభ్యర్థించారు కూడా.

■ రూ. 405 కోట్లు విడుదలైతేనే స్మార్ట్ సిటీకి మోక్షం

తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 1586 కోట్లు కాగా ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం తన వాటా రూ. 500 కోట్లలో రూ. 388.02 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ. 500 కోట్లలో రూ. 186 కోట్లు విడుదల చేసింది. టీటీడీ తన వాటా రూ. 435.50 కోట్లలో రూ. 385.50 కోట్లు విడుదల చేసింది. ఎస్సీ డీసీఎల్ వాటా రూ. 150.54 కోట్లకు గానూ మొత్తం ఖర్చు చేసేసింది. కేంద్రం నుంచీ రూ. 98 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచీ రూ. 304 కోట్లు, టీటీడీ నుంచీ రూ. 50 కోట్లు చొప్పున ఇంకా నిధులు విడుదల కావాల్సి వుంది. ఇందులో టీటీడీ నిధుల విడుదలకు ఎలాంటి సమస్యా లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విడుదలే సమస్యగా మారింది. ఈ నిధులు విడుదలైతే తప్ప తిరుపతి స్మార్ట్ సిటీ పనులకు మోక్షం కలగని పరిస్థితి నెలకొనివుంది. ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుంటే తప్ప ఇది సాధ్యం కాదు.

అంచనా వ్యయం సవరించాలి

2017-18లో మొదలై పెండింగ్‌లో ఉన్న స్మార్ట్ సిటీ పనులు పూర్తి కావాలంటే నిర్మాణ వ్యయం సవరించక తప్పదు. పెరిగిన మెటీరియల్ ధరలకు అనుగుణంగా పెంచాల్సి ఉంటుంది. లేకపోతే నాణ్యత పాటించే పరిస్థితి వుండదని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.



నెహ్రూ మున్సిపల్ హైస్కూలు ఆవరణలో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం



మామిడిపండ్లు వచ్చేశాయోచ్

మామిడి పండ్ల సీజన్ ఆరంభమైంది. జనవరిలోనూ భారీ వర్షాలు కురవడంతో మామిడిపూత తక్కువగా కనబడింది. అయితే చెట్లను రైతులు తిరిగి సంరక్షించుకోవడంతో కాపు మొదలైంది. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రాంతాల్లో తొలిసారిగా మామిడిపండ్లు కనిపించాయి. తొలిసారి కాపు కావడంతో కిలో రూ.250 ధర పలికింది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



స్మార్ట్ సిటీ పనులను త్వరగా పూర్తి చేయండి



కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో స్మార్ట్‌సిటీ నిధులతో జరుగుతున్న పెండింగ్ పనులను సకాలంలో పూర్తిచేయాలని స్మార్ట్‌సిటీ ఛైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం స్మార్ట్‌సిటీ ఎండీ, కమిషనర్ మౌర్య అధ్యక్షతన 38వ బోర్డు మీటింగ్ నిర్వహించారు. వర్చువల్ విధానంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఐ ట్రిపుల్ సీ (ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్) విధానం ద్వారా స్మార్ట్ సిటీ పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. త్వరగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇంజనీరింగ్ చీఫ్, ఇండిపెండెంట్ డైరెక్టర్లు డాక్టర్ రామచంద్రా రెడ్డి, రమాశ్రీ, స్మార్ట్‌సిటీ జీఎం చంద్రమౌళి పాల్గొన్నారు.

పాముల సయ్యాట



సాయంసంధ్య వేళ.. గంటన్నరసేపు రెండు పాములు మైమరచి సయ్యాటలాడాయి. దారిన పోయేవారు సందడి చేసినా తమకేమీ పట్టనట్టు వ్యవహరించాయి. ఈ దృశ్యం కేవీబీపురం మండలం కళత్తూరు పెద్ద చెరువు వద్ద కనిపించింది.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

జిల్లా స్పెషల్ బ్రాంచ్ ప్రక్షాళన షురూ

● తొలి విడతలో 16 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల బదిలీ ● అందులో ఎనిమిది మంది వీఆర్‌కు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధనరాజు స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ)లో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. గత ఐదేళ్ల పాటు ఒకే చోట పనిచేస్తూ పలువురు అప్పటి వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటి ప్రజా ప్రతినిధుల అడుగుజాడల్లో నడచి పోలీసు శాఖ ప్రతిష్ఠను దిగజార్చినట్లు పలువురిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో తొలి విడతగా ఎస్‌బీని ప్రక్షాళన చేసి.. ఆ తర్వాత కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు, ఎస్ఐలను బదిలీ చేయాలని ఎస్పీ నిర్ణయించినట్లు సమాచారం. దీంతో ఉన్నపళంగా ఎస్‌బీలోని పలువురు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఎనిమిది మందిని వీఆర్‌కు బదిలీ చేశారు. వారిలో.. తిరుమల ఎస్బీలోని ఏఎస్ఐ కుమారస్వామి, తిరుపతి వెస్ట్ సోమ్లానాయక్, వడమాలపేటలోని మురళీ రెడ్డి, పిచ్చాటూరు, కేవీబీపురంలో పనిచేస్తున్న శ్రీరాములు, తొట్టంబేడు, బీఎన్‌కండిగలో పనిచేస్తున్న శ్రీహరి, పుత్తూరులో పనిచేస్తున్న దేవరాజులు, తిరుపతి ఎస్బీలోని నిరంజన్, శ్రీకాళహస్తి వన్‌టౌన్, టూటౌన్‌లో ఉన్న చెంచురామయ్య ఉన్నారు. ఇక, వివిధ కేడర్లలో పలు చోట్ల పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. వారిలో ఇప్పటి వరకు తిరుపతి వీఆర్‌లో ఉన్న గోవిందస్వామి, ధనంజయ, తిరుచానూరులో పనిచేస్తున్న పద్మనాభం, శ్రీకాళహస్తి వన్‌టౌన్‌లో పనిచేస్తున్న సుందర్, తిరుమల వన్‌టౌన్‌లోని జయకుమార్, తిరుపతి సీసీఎస్‌లో పనిచేస్తున్న శ్రీనివాసులు, ఎస్వీయూ క్యాంపస్‌లోని ఉదయ్‌కుమార్, తిరుపతి సీసీఎస్‌లోని యుగంధర్ ఉన్నారు. ఈ మేరకు ఎస్పీ హర్షవర్ధనరాజు ఉత్తర్వులు జారీ చేసి.. తక్షణం అమల్లోకి వస్తాయన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:27 (శనివారం సాయంత్రం)

సహర్: 4:52 (ఆదివారం ఉదయం)

ఒకటిన పింఛన్ల పంపిణీ

● 2,61,841 మందికి రూ.111.82 కోట్లు కేటాయింపు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఏప్రిల్ ఒకటో తేదీ ఉదయం 7 గంటల నుంచి ఇళ్లవద్ద లబ్ధిదారులకు అందజేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,61,841మందికి రూ.111.82 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 34 మండలాల్లో పింఛన్ల పంపిణీ విధుల్లో 5వేలమంది సచివాలయ సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎల్లుండి టెన్త్ పరీక్ష వాయిదా

● 1న సోషియల్ పరీక్ష నిర్వహణ

తిరుపతి(విద్య), మార్చి 28(ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా పదో తరగతి చివరి రోజు సోషియల్ పరీక్షను మంగళవారానికి వాయిదా వేసినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. పరీక్షల షెడ్యూల్లో భాగంగా చివరి పరీక్ష సాంఘిక శాస్త్రం ఈనెల 31న (సోమవారం) జరగాల్సి ఉందన్నారు. ఆ రోజు రంజాన్ రావడంతో మంగళవారానికి సాంఘిక శాస్త్ర పరీక్ష వాయిదా పడిందన్నారు. కాగా, శుక్రవారం జరిగిన జీవశాస్త్రం పరీక్షకు 348 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 27,141 మందికిగాను 26,793 మంది పరీక్ష రాశారు.

ఈకేవైసీ చేసుకోవాల్సింది 1.58 లక్షల మంది

● నెలాఖరు వరకే గడువు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులకు సంబంధించి జిల్లాలో ఇంకా 1.58 లక్షల మంది ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంది. వీరిలో ఐదేళ్లపైబడిన పిల్లలు 22,300 మంది ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది తూర్పు మండలాల్లోనే ఉంటున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. వీరంతా నెలాఖరులోగా ఈకేవైసీ చేసుకోకుంటే రేషన్ సరుకులు అందవని అధికారులు అంటున్నారు. జిల్లాలోని రేషన్ కార్డుల్లో 16.30 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరిలో పెండింగ్ ఉన్న వారు మాత్రమే ఈకేవైసీ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. అయితే, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన రేషన్‌కార్డుల్లోని సభ్యులు ఈకేవైసీ చేసుకోవడంలో సమస్య తలెత్తుతోంది. ఇలాంటి వారు స్థానికంగా కాకున్నా రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో ఉన్నా అక్కడ మీ సేవ, రేషన్ షాపులు, ఆధార్ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. రేషన్ డీలర్లు, తహసిల్దార్లు, డీఎస్‌వోలు, లాగిన్లలో ఈకేవైసీ వివరాలు అందుబాటులో ఉంచారు.

అభివృద్ధి పనులకు పచ్చజెండా

● ఎస్వీయూ పాలకమండలిలో పలు తీర్మానాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పాలక మండలి సమావేశం పలు అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపింది. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. పరీక్షా పేపర్ల మూల్యాంకనం రుసుం పెంచాలని నిర్ణయించింది. వీసీ అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో తొలుత ఆర్థిక కమిటీ సమావేశం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన రూ.226 కోట్లకు ఆర్థిక అనుమతులు తీసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు రూ.100 కోట్ల రెండో దశ నిధుల కేటాయింపునకు అనుమతులు పొందారు. ఫార్మసీ కాలేజీ భవన నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. యూనివర్సిటీలో అత్యవసర ఇంజనీరింగ్ పనులకు ఆమోదం తెలిపారు. అనుబంధ కాలేజీల గుర్తింపునకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, ఉన్నత విద్యాశాఖ తరపు ప్రతినిధి భరత్‌గుప్తా, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి అల్లాడ గౌతమ్, ఈసీ సభ్యులు జ్యోతి, నారాయణబాబు, సంధ్యారాణి, మొహిద్దీన్‌బాషా, మంజుల, సుమకిరణ్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ ఆశలు

- వివరాలు 4లో -

● జాబితాలతో సిద్ధమైన టీడీపీ, జనసేన
● తిరుపతిలో కరువైన ఏకాభిప్రాయం
● నేడు విజయవాడకు తుది జాబితా?



తిరుమలలో 'రాబిన్‌హుడ్'

తిరుమల, మార్చి28(ఆంధ్రజ్యోతి): 'రాబిన్‌హుడ్' సినిమా హీరో నితిన్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన సినిమా విడుదల సందర్భంగా శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సినిమాను అందరూ చూసి ఎంజాయ్ చేయాలని కోరారు. తన తర్వాత చిత్రం 'తమ్ముడు' మే లేదా జూన్ నెలలో విడుదల కానుందన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి వచ్చిన నితిన్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించగా, వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయం ముందు నితిన్‌ను చూసేందుకు, సెల్ఫీల కోసం పలువురు ఉత్సాహం చూపారు.


సతీష్‌రెడ్డి


అశోక్‌బాబు



శ్రీనివాసన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. డీఆర్డీవో మాజీ ఛైర్మన్, ఏపీ శాస్త్ర సాంకేతిక సలహాదారు సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎన్ఎస్జీ డీజీ భ్రిగు శ్రీనివాసన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 13 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.


బుధవారం హుండీ ఆదాయం: రూ.4.36 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,279

తలనీలాలు సమర్పించినవారు: 24,482

నామినేటెడ్ ఆశలు

- జాబితాలతో సిద్ధమైన టీడీపీ, జనసేన
- కరువైన ఏకాభిప్రాయం
- నేడు విజయవాడకు తుది జాబితా?



తిరుపతి- ఆంధ్రజ్యోతి

మూడో విడత నామినేటెడ్ పదవుల జాబితాపై తిరుపతిలోని కూటమి పార్టీల నాయకులు పెద్దఎత్తున ఆశలు పెట్టుకున్నారు. జాబితా కసరత్తులో స్థానిక నాయకత్వం మల్లగుల్లాలు పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పదవులను ఉగాదికి అటు, ఇటుగా విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. తుడా ఛైర్మన్ పీఠంపై అధిష్ఠానందే తుది నిర్ణయం కాబట్టి ఆశావహులు మౌనందాల్చారు. తక్కిన ఆలయాల పాలక మండళ్లు, టీటీడీ ధార్మిక సలహా మండళ్లతో పాటు వివిధ శాఖలకు సంబంధించి నామినేటెడ్ పదవుల జాబితాపై కసరత్తు తుది దశకు చేరుకుంది. నగరంలో ప్రధానంగా దేవదాయశాఖకు చెందిన ప్రసిద్ధ ఆలయం తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం ఛైర్మన్‌కు పోటీనెలకొంది. తాళ్లపాక పెదగంగమ్మ, వేశాలమ్మ, అంకాళమ్మ, రామాలయం పాలకమండళ్ల జాబితా దాదాపుగా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీ, జనసేన నుంచి పోటాపోటీగా పదవులు ఆశిస్తున్నట్లు కనిపిస్తోంది.

ఎవరి జాబితాలు వారివి

స్థానికాలయాల పాలకమండళ్ల కోసం జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన అనుచర వర్గానికి నామినేటెడ్ పదవులను కేటాయించేందుకు ఆసక్తి చూపుతూ జాబితా సిద్ధం చేశారన్న ప్రచారం జరుగుతోంది. మరోవైపు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ తన అనుచరవర్గంతో జాబితా సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపే ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ఉదాహరణకు గంగమ్మ ఆలయ పాలకమండలిలో 11 మంది సభ్యులుంటే టీడీపీ, జనసేనకు ఐదుగురు చొప్పున, బీజేపీకి ఒకరిని కేటాయించాలని మెజారిటీ నాయకుల అభిప్రాయంగా కనిపిస్తోంది. అయితే టీడీపీ, జనసేన ముఖ్య నాయకులు మాత్రం తమకంటే తమకు ఎక్కువ సభ్యులు కావాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. వాటా సంగతి అటుంచితే ఎవరికివారు జాబితాను తయారు చేసి పంపేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. గంగమ్మ ఆలయ ఛైర్మన్ విషయంలో ఇరు నేతల మధ్య బేధాభ్రియాలు రావడం వల్లే రెండు జాబితాలకు తెరలేచినట్టు సమాచారం. రెండు రోజుల క్రితం సుగుణమ్మ నివాసంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో టీడీపీ కార్యాలయం నుంచే తుది జాబితా పంపాలని ఆపార్టీ నేతలు కొందరు ఒత్తిడి తీసుకొచ్చారు. సిద్ధంచేసిన జాబితాలను ఎవరికి వారు విజయవాడకు పంపేపనిలో ఉన్నట్టు తెలిసింది.

ఏకాభిప్రాయంతోనే అందరికీ న్యాయం

ఇక టీటీడీకి చెందిన ధర్మప్రచార పరిషత్, ఎస్వీబీసీ కమిటీలోను సీనియర్లకు చోటుకల్పించేందుకు ఎమ్మెల్యే పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ఉద్యోగ సంఘాల మాజీ నేతతో పాటు మాజీ పోలీస్ అధికారి పేరు వినిపిస్తోంది. ఎన్నికల ముందు పార్టీ విజయానికి కృషిచేసిన సీనియర్లను గుర్తింపు ఇస్తే కేడర్‌లో నమ్మకం కుదురుతుందన్న ఆలోచనతో జనసేన నాయకత్వం ఉన్నట్టు తెలుస్తోంది. సీనియర్లకు తొలి రెండేళ్లు అవకాశం ఇచ్చి తర్వాత రెండేళ్లు యువతకు చోటుకల్పించాలన్న యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అభిప్రాయ బేధాలు లేకుండా నిర్ణయం తీసుకుంటే విజయం కోసం పనిచేసిన వారికి న్యాయం దక్కుతుందని కూటమి వర్గాలు పేర్కొంటున్నాయి.

శ్రీసిటీలో నేడు ఉగాది పురస్కారాల ప్రదానం

శ్రీసిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని శ్రీసిటీలోని ఆధ్యాత్మిక సాహిత్య వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు పురస్కారాలను అందజేయనున్నారు. వారిలో ప్రముఖ అవధాన కవి డాక్టర్ నరాల రామారెడ్డి, పురావస్తు పరిశోధకుడు, స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, సినీ చరిత్రకారుడు ఎస్వీ రామారావు, సంగీత విధూషిమణి రాణీ నాగశ్రీ శైలేశ్వరి, చమత్కారోపన్యాసకుడు ప్రాస మణి ఉన్నారు. వీరికి స్థానిక బిజినెస్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల కార్యక్రమంలో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి పురస్కారాలను అందజేయనున్నారు.



డాక్టర్ నరాల రామారెడ్డి: కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన అవధాన కవి.



ఈమని శివనాగిరెడ్డి: తెనాలికి చెందిన ఈయన ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడి తెలంగాణ ప్రభుత్వ చారిత్రక దేవాలయాలకు పరిశోధకుడిగా, సలహాదారుగా ఉన్నారు. చారిత్రక, దేవాలయాలపై సుమారు 500 పుస్తకాలు రచించారు.



ఎస్వీ రామారావు: ఈయన సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ 1998లో పదవీవిరమణ పొందారు. తన 13వ ఏట నుంచి నాటకాలపై మక్కువతో ఎన్నో ప్రదర్శనలు చేశారు. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమకు చారిత్రక పరిశోధకుడు. నంది అవార్డులు కూడా వరించాయి.



రాణి నాగశ్రీ శైలేశ్వరి: సంగీతంపై ఆమెకు మక్కువ ఎక్కువ. ఆ మక్కువతో సంగీత రంగంలో సంగీత విదూషీమణిగా తిరుపతి మహిళా యూనివర్శిటీలో సంగీతశాఖకు విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



ప్రాస మణి: ఈయన చమత్కారోపన్యాసకుడు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన ఈయన అసలు పేరు అన్నదాత సుబ్రహ్మణ్యేశ్వరరావు. కామర్స్‌లో పాఠాన్ని ప్రాసగా చెప్పడంలో దిట్ట. ఏపీలోనే తెలుగుభాష, సంస్కృతి, హైందవ తెలుగు సంస్కృతుల మీద ప్రావీణ్యం, పట్టున్న వ్యక్తి.


పోలేరమ్మ వెళ్లనంపు గ్రామోత్సవం


ఊరేగింపులో గణాచారి, ఈవో నవీన్‌కుమార్ తదితరులు

- ఘనంగా పోలేరమ్మ వెళ్లనంపు గ్రామోత్సవం
- ముగిసిన ముత్యాలమ్మ జాతర

అక్కా.. పోయి వస్తానే..!

చిల్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'అక్కా.. పోయి వస్తానే. మళ్లీ వచ్చే ఏడాది వస్తానే..' అంటూ పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మకు చెప్పి నిమజ్జనానికి బయలుదేరగా, భక్తులు చీరలు పరిచి సాగిలి పడి సాగనంపారు. ముత్యాలమ్మ జాతరలో ఆఖరి ఘట్టమైన 'పోలేరమ్మ వెళ్లనంపు' కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో నాలుగురోజులు పాటు వైభవంగా జరిగిన జాతర శుక్రవారంతో ముగిసింది. గంగమిట్ట మీద కొలువుతీరిన పోలేరమ్మకు వేకువజామున కుంభం పోసి, నైవేద్యం సమర్పించారు. అనంతరం పోలేరమ్మ జాతర ముగుస్తున్నట్లు గణాచారి ప్రకటించారు. ఆ తర్వాత పోలేరమ్మ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమం ప్రారంభంకాగానే బాణసంచా పేల్చగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీధులలో మహిళలు చీరలు పరిచి అమ్మవారిని చీరలపై సాగనంపారు. కోరుకున్న కోర్కెలు తీర్చాలంటూ మహిళలు పూజలు చేశారు. పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించాక పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మను అక్కా వెళ్లివస్తానంటూ పలకరించే సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. ముత్యాలమ్మ ఆలయంలో పోలేరమ్మ విగ్రహాన్ని ఉంచి గణాచారి ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఊరి చివర మైదానంలోకి పోలేరమ్మ విగ్రహాన్ని తీసుకెళ్లి అక్కడ పంబలోళ్లు డప్పు వాయిస్తుండగా.. ఆసాదులు పోలేరమ్మ కథను భక్తులకు వినిపించారు. ఆమెకు ఇష్టమైన బూతు పురాణాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మహిళలకు అమ్మవారి పూనకం వచ్చి, చిందులు వేస్తూ వచ్చే ఏడాది వస్తానంటూ చెబుతారు. ఆ మహిళలపై గణాచారి పసుపునీళ్లు చల్లి దీవెనలు అందించడంతో జాతర ముగిసింది. ఆలయ ఈవో నవీన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించగా, డీఎస్పీ గీతాకుమారి బందోబస్తు నిర్వహించారు. ఇక, జాతర ముగియడంతో భక్తులు ఒక్కసారిగా వెనుదిరగడంతో రద్దీ నెలకొంది. తూర్పుకనుపూరులో తిరుగు ప్రయాణమయ్యే జనంతో పోటెత్తిపోయింది. వాహనాలు వరుసక్రమంలో బారులు తీరడంతో పలు చోట్ల రాకపోకలు ఆగాయి. కాగా, ముత్యాలమ్మ జాతర సందర్భంగా హుండీ శుక్రవారం హుండీ లెక్కించగా మొత్తం రూ.64,46,838 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. అదే గతేడాది రూ.53,60,973 వచ్చిందన్నారు. గతేడాది కంటే రూ.11,14,135 పెరిగింది.


జాతర నుంచి తిరిగి గ్రామాలకు వెళ్లేందుకు బస్సుల కోసం వేచివున్న భక్తులు

హత్యాయత్నం కేసులో ఫీల్డ్ అసిస్టెంట్ అరెస్ట్

సత్యవేడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వాహనంతో ఢీకొట్టి హత్యకు ప్రయత్నించిన సత్యవేడు మండలం కన్నవరానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సీఐ మురళి తెలిపిన ప్రకారం.. సత్యవేడులోని ఉలవచేనుకు చెందిన పవన్ ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఇటీవల పరీక్షలు రాశాడు. ఇతడు కన్నవరం హరిజనవాడకు చెందిన యువతి మూడేళ్లగా ప్రేమించుకుంటున్నారు. ఆమెను కలిసేందుకు పవన్ తరచూ కన్నవరం వచ్చేవాడు. ఆ యువతి తల్లితో సన్నిహితంగా ఉండే ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ వీరి ప్రేమ వ్యవహారంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పవన్‌ను పలుమార్లు హెచ్చరించాడు. ఈ క్రమంలో భాస్కర్‌కు బుద్ధి చెప్పాలంటూ ఆ యువతి పవన్‌ను కోరింది. దీంతో ఈనెల 24వ తేది మధ్యాహ్నం పవన్ తన స్నేహితులైన సత్యవేడుకు చెందిన భరత్, నాగలాపురం మండలం బీరకుప్పానికి చెందిన సారథి, ఉదయ్‌ను వెంటబెట్టుకుని కన్నవరానికి చేరుకుని భాస్కర్‌తో గొడవపడ్డాడు. స్థానికులు సర్ది చెప్పి పంపేశారు. దీన్ని అవమానంగా భావించిన భాస్కర్.. పవన్‌ను మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. అదే రోజు సాయంత్రం తన లగేజీ వాహనంలో సత్యవేడు నుంచి కన్నవరానికి వస్తుండగా.. మార్గమధ్యంలో ఏఎంపురం వద్ద పవన్ తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తుండడం గమనించి వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో సారథి, ఉదయ్, పవన్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో సారథి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. పవన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసి భాస్కర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ వద్ద భాస్కర్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బాధితుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. చట్టప్రకారం న్యాయం చేస్తామని సీఐ మురళి హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

మాటిస్తే నెరవేర్చే వరకు మరువను

● ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):ఎవరికైనా సరే మాటిస్తే నెరవేర్చే వరకు మరిచేదిలేదని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు.మరమగ్గ చేనేత కార్మికుల చిరకాల వాంఛ అయిన ఉచితవిద్యుత్ జీవో విడుదల చేసిన సందర్భంగా నగరి పట్టణ పరిధిలోని ఏకాంబరకుప్పం రైల్వేగేట్ సమీపంలో శుక్రవారం రాత్రి కృతజ్ఞతా సభ ఏర్పాటు చేశారు.వేలాదిమంది చేనేత, మరమగ్గ కార్మికులు హాజరైన ఈ సభకు ఎమ్మెల్యే భానుప్రకాష్ రాగానే గజమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఆయన సభలో మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6 నెలల్లో 60 కోట్ల రూపాయలతో సిమెంటురోడ్లు వేయడం జరిగిందన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నేతన్నలకు,మరమగ్గ కార్మికులకు నెలకు 500 యూనిట్లు, చేనేత కుటుంబాల వారికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలుకు జీవోను సైతం విడుదల చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు ,మంత్రి లోకేశ్‌కే దక్కుతుందన్నారు.గతంలో ఏ ప్రభుత్వం కూడా తీసుకోని ఈ మంచి నిర్ణయాన్ని తీసుకుని నేతన్నలకు పూర్వ వైభవం వచ్చేలా చంద్రబాబు కృషి చేశారన్నారు.2012లో తన తండ్రి ముద్దుకృష్ణమ నాయుడు 50శాతం విద్యుత్ సబ్సిడీని నేతన్నలకు ఇప్పించడం జరిగిందని గుర్తు చేశారు.అలాగే నగరి మున్సిపాలిటీ అయ్యాక ఇంటి పన్ను ఎక్కువైందంటే ఆయనే తగ్గించేందుకు కృషి చేశారన్నారు.వైసీపీ అధికారంలో వున్నపుడు పెంచిన కరెంటు చార్జీలను భరించలేక మరమగ్గ కార్మికులు తమ వృత్తిని వదిలి పక్క రాష్ట్రాలకు వలస వెళ్లారన్నారు.ఏకాంబరకుప్పం రైల్వేగేట్ అండర్‌బ్రిడ్జి ఏర్పాటుకు సైతం నిధులు మంజూరు చేయించడం జరుగుతుందన్నారు.స్థానిక టీడీపీ నాయకులతో పాటు టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు తదితరులు పాల్గొన్నారు.


మరమగ్గ కార్మికుల కృతజ్ఞతా సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్



'ఎర్ర'స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు నమోదు చేయాలని ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా నల్లపట్టు గ్రామానికి చెందిన శివమణి అలియాస్ శివమణి గోవిందన్ శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నాడు. ఇతనిపై చాలా కేసులు ఉండడంతో పీడీ యాక్టు నమోదుకు టాస్క్‌ఫోర్సు అధికారులు కలెక్టర్‌కు లేఖ రాశారు. పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

హత్యాయత్నం కేసులో ఆడిటింగ్ అధికారి అరెస్టు

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడన్న కేసులో ప్రభుత్వ ఆడిట్ ఆఫీసర్ మధుకిరణ్‌రెడ్డిని పోలీసులు శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్ద అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరులో అసిస్టెంట్ ఆడిటింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న మధుకిరణ్‌రెడ్డి రెండు రోజుల క్రితం డిప్యూటేషన్‌పై శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఆడిటింగ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈనెల 17న కడప మహిళా పోలీస్‌స్టేషన్‌లో మధుకిరణ్‌రెడ్డిపై ఆయన భార్య ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా కడప మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్దకు చేరుకున్నారు. విధుల్లో ఉన్న అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి మధుకిరణ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని 1టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి కడప మహిళా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ముత్యాలమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, రామకృష్ణ, టీడీపీ సీనియర్ నేతలు కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజీ

చిల్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో ముత్యాలమ్మకు ఎమ్మెల్యేలు పాశం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ పట్టు వస్త్రాలు సమర్పించారు. నాలుగు రోజుల పాటు జరిగిన జాతర శుక్రవారం ముగిసింది. ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ నాయకులు అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకురావడంతో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పూర్ణకుంభంతో ఆలయ ఈవో నవీన్‌కుమార్ స్వాగతం పలికారు. జాతరకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరవడంతో తూర్పుకనుపూరులో రద్దీ నెలకొంది. వాహనాలు బారులు తీరడంతో పలు చోట్ల ట్రాఫిక్ సమసమ్య ఉత్పన్నమైంది.

పెరిగిన అమ్మవారి హుండీ ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తునన భక్తులు, సిబ్బంది

చిల్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ హుండీ ఆదాయం గతేడాది కంటే ఈసారి రూ.11,14,135 పెరిగినట్లు ఆలయ ఈవో నవీన్ కుమార్ తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. అమ్మవారికి సమర్పించిన దున్నపోతుల వేలం పాటల ద్వారా గతేడాది రూ.19,35,000 రాగా, ఈ ఏడాది రూ.16,80,000 వచ్చింది. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా గతేడాది రూ.11,05,110 రాగా ఈసారి రూ.16,85,300 వచ్చింది. హుండీ ద్వారా గతేడాది రూ.23,20,863 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.30,81,53 వచ్చింది. మొత్తం మీద గతేడాది రూ.53,60,973 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.64,46,838 వచ్చిందని ఈవో పేర్కొన్నారు.

నెలబల్లిలో ప్రభుత్వ భూముల పరిశీలన



నెలబల్లిలో భూములను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తహసీల్దారు శైలాకుమారి

దొరవారిసత్రం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం నెలబల్లిలో జాతీయ రహదారి పక్కన గల ప్రభుత్వ భూములను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ శుక్రవారం పరిశీలించారు. జాతీయ రహదారి పక్కన సర్వే నెంబరు 7లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకొంటున్నామని, తమకు డీ పట్టాలు మంజూరు చేయాలని ఆ గ్రామానికి చెందిన పునబాక రమణయ్య, ఆయన సోదరులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. దీంతో జేసీ ఆ పరిశీలించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న భూములు ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడే అవకాశం ఉన్నందున పట్టాలు ఇవ్వలేమని జేసీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శైలాకుమారి, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 26 మంది ఎంపిక



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శివప్రసాద్

గూడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం శ్రీసిటీకి చెందిన వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. 50 మంది అభ్యర్థులు హాజరు కాగా, వివిధ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 26మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, కోటేశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.

వార్షిక రుణ ప్రణాళికపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం హేమామాలిని

పెళ్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలకు రుణాలు, జీవనోపాధుల కార్యచరణ ప్రణాళికపై పెళ్లకూరు వెలుగు కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం హేమామాలిని మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో మహిళా ఎన్యూమరేటర్లు ఏప్రిల్ 1 నుంచి పొదుపు మహిళల ఇంటి వద్దకే వెళ్లి ఎంత రుణం ఏ నెలలో కావాలి, ఎప్పుడు కావాలి, రుణం పొందేందుకు గల అవసరాన్ని తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌సీసీ శీనయ్య, వెలుగు సీసీలు రమణమ్మ, చంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

11న ఢిల్లీలో లాంగ్‌మార్చ్

నాయుడుపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఏప్రిల్ 11వ తేదీ నిర్వహించనున్న లాంగ్‌మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయుడుపేటకు చెందిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి రామ చంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం లాంగ్‌మార్చ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యవసర సరుకుల ధరల నియంత్రణ, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో పాటు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే మతతత్వ రాజకీయాలు మానుకోవడంతో పాటు నేతాజీకి సంబంధించిన డీఎస్‌ఏ పత్రాలను బహిర్గత పరచాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి అనుమతి లేకుండా ప్రవేశంపై కేసు

నాయుడుపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించినందుకు మండలంలోని కూచువాడకు చెందిన ఆషీష్, కార్తీక్, మరి కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. శుక్రవారం ఆషీష్, కార్తీక్‌తో పాటు మరి కొంతమంది అనుమతి లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి ప్రవేశించి ఫొటోలు, వీడియోలు తీశారు. ప్రశ్నించిన ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ పెంచలయ్యను బెదించారు. అనంతరం కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అండగుండాల రోడ్డుకు మోక్షం ఎప్పుడో..?



కంకర తేలి అధ్వానంగా ఉన్న అండగుండాల రోడ్డు

తడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అన్ని దహదారులు బాగుపడుతున్నా... అండగుండాల రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. అధికారులకు, నాయకులకు విన్నవించుకుంటున్నా పట్టించుకునే వారే లేరు. మండల పరిధిలోని అండగుండాల గ్రామానికి వెళ్లాలంటే.. అక్కంపేట జాతీయ రహదారి నుంచి సుమారు 2 కిలోమీటర్ల మేర ప్రయాణించాలి. వరదయపాలెం మండలంలోని కారిపాకం గ్రామానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డుకు గ్రహణం పట్టింది. అప్పటి ప్రభుత్వం కనీసం మరమ్మతులు చేయకపోవడంతో దారుణంగా దెబ్బతింది. గుంతలమయమైన ప్రయాణం నరకప్రాయంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లె పండుగ పేరుతో అన్ని గ్రామాల్లోని రోడ్లకు నిధులు కేటాయించి బాగు చేస్తున్నారు. అయితే అండగుండాల రోడ్డును మాత్రం ఎవరూ పట్టించుకోవడంలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కురుగొండలో రూ.1.25 కోట్ల ఉపాధి పనులు



గ్రామసభలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు అంకయ్య

ఓజిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగొండలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 కోట్ల ఉపాధి పనులు జరిగాయని డీఆర్పీ ప్రసన్నకుమార్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం కురుగొండలో గ్రామస్థాయి ఆడిట్ జరిగింది. ఈసందర్భంగా డీఆర్పీ మాట్లాడుతూ ప్రధానంగా గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో 13 పనులు, కేటిల్ పాండ్స్ కోసం 26 పనులతో పాటు డ్రైనేజీ, సిమెంటు రోడ్ల పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామ పరిధిలో ఇంకా రూ.లక్ష మేర చేపట్టాల్సిన పనులు ఉన్నాయని, వాటిని చేయించాలని క్షేత్ర సహాయకుడికి నిర్దేశించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, విశ్రాంత డీపీఎంవో డాక్టర్ దారా అంకయ్య, టీఏ మహేష్, కార్యదర్శి కావ్య, ఈసీ సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి జీఎస్టీ కీలకం

కేంద్ర వార్షిక బడ్జెట్, పన్నులు, ఆడిటింగ్‌పై శ్రీసిటీలో అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆనంద్‌కుమార్

శ్రీసిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టేందుకు జీఎస్టీ కీలకంగా మారుతుందని గుంటూరు ఆడిట్ కమిషనరేట్, ఐఆర్ఎస్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్ తెలిపారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఆధ్వర్యంలో శ్రీసిటీలో శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర పరోక్ష పన్నులు, సుంకాల మండలి (సీబీఐసీ), భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), శ్రీసిటీ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర వార్షిక బడ్జెట్, పన్నుల ఆడిటింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పరిశ్రమలకు తాజా పన్నుల విధానం, అనుగుణ్యత మార్గదర్శకాలు, కేంద్ర బడ్జెట్ ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆనంద్‌కుమార్ ప్రభుత్వం జీఎస్టీని సులభతరం చేయడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. 'ఒక దేశం ఒక పన్ను' విధానం వల్ల పన్ను చెల్లింపుదారుల సంఖ్య 70 లక్షల నుంచి 140 లక్షల వరకు పెరిగిందన్నారు. మధ్యస్థ పన్నురేటు 14.5 శాతం నుంచి 11.5 శాతానికి తగ్గిందని దీని ఫలితంగా ఆర్థిక వృద్ధి వేగంగా పెరుగుతూ, వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించడానికి ప్రాముఖ్యం సంతరించుకుంటోందని తెలిపారు. పన్ను చెల్లింపు ప్రక్రియను మరింత సులభతరం చేయడంతో పాటు పన్ను చెల్లింపుదారుల సంఖ్యను పెంచేందుకు తమ విభాగం ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. రాయలసీమ జోన్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మాలతి మాట్లాడుతూ... ప్రస్తుత బడ్జెట్‌లో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, అంతర్గత జలమార్గాలు, సాగర్‌మాలా, ప్రధాన్‌మంత్రి గతిశక్తి, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్, పరిశోధన - అభివృద్ధి, స్టార్టప్‌లు, వ్యవసాయం, ఇతర రంగాలకు కేటాయించిన నిధుల వివరాలను వివరించారు. కార్యక్రమంలో శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

31లోగా ఈకేవైసీ చేయించుకోండి

కోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు దారులు ఈ నెల 31వ తేదీ లోగా ఈకేవైసీ చేసుకోవాలని తహసీల్దారు జయజయరావు తెలిపారు. రేషన్ డీలర్లు ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా గ్రామ, వార్డు, సచివాలయాల యాప్, రేషన్‌షాపులోని ఈ ఫోన్ ద్వారా ఈకేవైసీ చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లల మినహా మిగిలిన లబ్ధిదారులు అందరూ ఈకేవైసీ చేసుకోవాలని తహసీల్దారు సూచించారు.

రెండు ఆలయాల్లో చోరీ



ముళ్లచెట్లలో పడి ఉన్న హుండీని బయటకుతీస్తున్న స్థానికులు

తడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారిజాత గ్రామంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, దళితవాడలోని సీతారాముల ఆలయంలో హుండీలు చోరీకి గురయ్యాయి. గురువారం అర్ధరాత్రి సమయంలో దొంగలు ఆలయంలోకి చొరబడి హుండీలను ఎత్తుకెళ్లారు. ఈ రెండు హుండీలను గ్రామ శివార్లలోని చెట్లలో పడేసి, వాటిల్లో నగదు ఎత్తుకెళ్లారు. దళితవాడలో ఉన్న సీతారాముల ఆలయంలోని హుండీలో సుమారు రూ.30వేలవరకు భక్తులు సమర్పించిన కానుకలు ఉండవచ్చని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ

పెళ్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేలా తెలుగు భాషలో త్రైత సిద్ధాంత క్యాలెండర్‌ను రూపొందించటం అభినందయమని తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు పీహెచ్‌సీ, పోలీస్‌స్టేషన్, చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయాల్లో క్యాలెండర్లు ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో చింత సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, చామంతి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లు అందజేస్తున్న ఈద్గా యూత్ సభ్యులు

గూడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గా వద్ద శుక్రవారం ఈద్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ కిట్లును అందజేశారు. కార్యక్రమంలో షబ్బీర్, మగ్దూం, మౌలానా, మున్నా, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మసీదులో నూర్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ కిట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో హక్, మగ్దూం, హజరత్, సలీం, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధ దంపతులకు చేయూత

నాయుడుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రజక కాలనీలోని బాలాజీ, రాజమ్మ దంపతులకు ఉయ్ ఆర్ టుగేదర్ సంస్థ వ్యవస్థాపకులు సుబ్బు అయ్యప్ప, ప్రసాద్, పవన్ బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు అందజేశారు.

బీసీ కులగణన చేపట్టాలి

గూడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీసీ కులగణన త్వరితగతిన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజగౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయ సమీపంలోని జ్యోతిరావ్‌పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టి జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఇదే డిమాండ్లతో ఏప్రిల్ 25న తిరుపతిలో నిర్వహించనున్న బహిరంగసభను విజయవంతం చేయాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రసాద్, జగదీష్, మధు, రమణయ్య, నాశిన భాస్కర్ గౌడ్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగివుండాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది అరవ పార్వతయ్య

గూడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగివుండాలని న్యాయవాది అరవ పార్వతయ్య అన్నారు. శుక్రవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న దాడులను నివారించేందుకు ప్రభుత్వం పోక్సో చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకుని రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత రావు, కోటేశ్వరరావు, మెహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో మ్యూజికల్ ఫెస్ట్

కోట, మార్చి 28(ఆంధ్ర జ్యోతి): కోట మండలం విద్యా నగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రాత్రి మ్యూజికల్ ఫెస్ట్ 2025 జరి గింది. ప్రముఖ నేపథ్య గాయని మంగ్లీ బృందం ఆటపాటలతో అలరించింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నేదురు మల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆహ్లాదం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏటా నిర్వహిస్తున్నా మని చెప్పారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

కోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ ఈ నెలాఖరులో పదవీ విరమణ పొందనున్నారు. శుక్రవారం ఎంఈవో మస్తానయ్య, విశ్రాంత హెచ్ఎం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఆయనను ఎంఈవోతో పాటు ఉపాధ్యాయులు శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు.

సంప్రదాయాలకు ప్రతీకగా ఉగాది

గూడూరు అర్బన్ మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల సంప్రదాయాలకు ప్రతీకగా ఉగాది పండుగ నిలుస్తుందని డాక్టర్లు జనార్ధనరెడ్డి, రోహిణి అన్నారు. శుక్రవారం స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో విశ్వవసు నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రాహ్మణ పూజారుల దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, శివకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణ దంపతులను సన్మానిస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

బాలాయపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను పరిష్కరించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలపై ప్రజలు ఎక్కువగా తిరుగుతున్నారని, వాటి పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కరించలేని సమస్యలకు కారణాలు తెలుపుతూ రికార్డు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాసులు, రాంబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కరించండి



సమావేశంలో చైర్ పర్సన్ నక్కా భానుప్రియ, కౌన్సిలర్లు

వెంకటగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని వార్డుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బడ్జెట్ సమావేశం జరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.102 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా కౌన్సిలర్లు ఆమోదిం చారు. మున్సిపాలిటీలో ఆదాయ వనరులు ఉన్నా.. వాటిని సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు విఫలం అవుతున్నారని పలువురు కౌన్సిలర్లు విమర్శించారు. ఏఏ అంశాలపై ఆదాయం వస్తుందో సూచించడంతో పాటు పన్నుల వసూళ్లల్లో చొరవ చూపాలంటూ మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చెందోడులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పద్మావతి తదితరులు

కోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో శుక్రవారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిగాయి. స్విమ్స్ వైద్యులు పద్మావతి, హరిత, చిట్టేడు వైద్యాధికారి నాగరాజు, సిబ్బంది ఆధ్వర్యంలో మహిళలకు రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేశారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఎద్దల మురళీమోహన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, వెంకటేశ్వర్లు, మేకల వెంకటేశ్వర్లు, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి



బీజేపీలో చేరిన పద్మజతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నాయకులు దయాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక అలవలవారి కల్యాణ మండపంలో సూళ్లూరుపేట నియోజకవర్గ క్రియాశీలక సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలో పేద ప్రజలకు అవసరమైన ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని తెలిపారు. త్వరలోనే జిల్లాలో శ్రీసిటీ లాంటి మరో భారీ పారిశ్రామికవాడ క్రిష్ సిటీ సూళ్లూరుపేట, దుగరాజపట్నం ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారని, తద్వారా 25 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశం ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ అవినీతి రహిత పాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పట్టణానికి చెందిన మన్నెముద్దు పద్మజ బీజేపీలో చేరారు. ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, ఆరణి విజయభాస్కర్ రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, నూతలపాటి శ్రీనివాసులు, చెన్నకేశవులు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అత్తిరాల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి తీరనిలోటు

వాకాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పడగాల ప్రవీణ్‌కుమార్ మృతి తీరనిలోటని గూడూరు నియోజకవర్గ క్రైస్తవ సేవకుడు డాక్టర్ ఆశామీనన్ అన్నారు. శుక్రవారం స్థానిక నేదురుమల్లి జనార్ధనరెడ్డి విగ్రహం వద్ద డాక్టర్ ఆశామీనన్ ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లూథరన్ చర్చి సంఘ నాయకులు డ్యానియల్ చంద్రబాబు, ప్రభుచరణ్, కిషోర్, మహిపతి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు అందజేత

నాయుడుపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకొని నాయుడుపేట పట్టణం సంజాయ్‌గాంధీ కాలనీలో ఉన్న మేరీ వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులతో పాటు ఆశ్రమంలోని వృద్ధులకు దుస్తులను శుక్రవారం షేక్ ఖాజాబీ కుమారులు గౌస్‌బాషా, ఖాదర్‌బాషా, కరీముల్లా, అహ్మద్‌బాషా అందజేశారు.